www.bharathasakthi.com

# భారత్ శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 31 | హైదరాబాద్ | ఆదివారం,జులై 5 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## మీరు చాలా పాప్యులర్...
### ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసలు



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అర్ధాంగి ఉషా వాన్స్‌పై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉషా వాన్స్ నిర్వహిస్తున్న పిల్లల అక్షరాస్యత పోడ్‌కాస్ట్‌కు ట్రంప్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "వైట్‌హౌస్‌లో మీరు చాలా పాప్యులర్. మిమ్మల్ని అందరూ ఇష్టపడతారు" అని ఉషాను ఉద్దేశించి

2లో..



## ఆస్ట్రేలియా వస్తే
# చంపేస్తాం
### ప్రధాని మోదీకి బెదిరింపులు

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ప్రధాని మోదీకి ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు
- మెల్‌బోర్న్ ఈవెంట్‌కు సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్ కింద హెచ్చరికతో కూడిన కామెంట్
- రంగంలోకి దిగిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు
- ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసిన అధికారులు
- భద్రతను కట్టుదిట్టం చేసి, విచారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు

**న్యూఢిల్లీ (భారత శక్తి)** భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది రోజుల ముందు ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు (ఏఎఫ్‌పీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని మోదీ పర్యటనను, ప్రవాస భారతీయులతో జరగనున్న భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బెదిరింపు వెలువడింది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే కార్యక్రమంలో

2లో..

## మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే
# అప్పుల రాష్ట్రంగా మార్చారు
### సీఎం రేవంత్ రెడ్డి



**నాగర్‌కర్నూల్, :** దొరలకు సమస్యలపై అవగాహన ఉండకపోవచ్చని.. పేదల మధ్య పెరిగిన తనకు సమస్యలు తెలియవా? అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తట్ట పనికి, మట్టి పనికి మనమే కావాలి.. కానీ, పరిపాలనకు పాలమూరు బిడ్డలు పనికిరారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. భూమికి, విత్తనానికి మధ్య బంధం ఎలా ఉంటుందో.. పేదవాడికి, పాలన చేసేవాడికి మధ్య అదే బంధం ఉంటుందని పేర్కొన్నారు. అహంకారులకు బుద్ధి చెప్పాలా? వద్దా? అని ప్రశ్నించారు. గద్దర్ అన్నను గడీ ముందు నిలబెట్టినవారికి ఉరిశిక్ష వేసినా తక్కువే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధిగా 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని మిడ్జిల్‌లో శనివారం కృతజ్ఞత సభ జరిగింది. సభలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. 'మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు. పదేళ్లలో కేసీఆర్ కుటుంబంలో వారికే పదవులు వచ్చాయి. ప్రజాపాలన ఎందుకు పోవాలో ఎక్కడికక్కడ చర్చ పెట్టండి. రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా? ఉచిత కరెంట్ ఇచ్చినందుకు

## కల్తీలపై ఉక్కుపాదం
### ఆహార భద్రతపై చీఫ్ సెక్రటరీ సమీక్ష

- డ్రగ్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ విభాగాల విలీనానికి సన్నద్ధం..
- వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం



**భారత శక్తి జులై 4, హైదరాబాద్:** ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజూ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆహార నాణ్యత, భద్రతపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కల్తీ ఆహార పదార్థాల విక్రయదారులపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్రవ్యాప్తంగా నిరంతర తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు.

#### విభాగాలు సమన్వయంతో పనిచేయాలి

ఔషధ నియంత్రణ విభాగం (డ్రగ్ కంట్రోలర్), ఆహార భద్రతా విభాగం (ఫుడ్ సేఫ్టీ) పరస్పర

2లో..

## రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



**అమరావతి:** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జెఎస్ డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్ వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలను స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను

2లో..

## పేదల వైద్య సహాయంలో
# జాప్యం తగదు
### - సబితా ఇంద్రారెడ్డి

- తొమ్మిది నెలలు దాటినా ? అందని సీఎం సహాయ నిధి.
- గతంలో మూడు నెలల్లోనే పంపిణీ..
- ఇప్పుడు నిధుల కోతపై మహేశ్వరం శాసనసభ్యురాలు ఆందోళన.
- బ్ధిదారుల ఆవేదన.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే సబితా ఆగ్రహం!



**ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనతపై మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాడు కేసీఆర్ పాలనలో మూడు నెలల్లోనే అందిన వైద్య సాయం, నేడు పది నెలలైనా కానరాకపోవడం దారుణమన్నారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడుతూ, నిధుల కోత విధిస్తున్న సర్కార్ మొద్దునిద్ర వీడాలని, తక్షణమే సకాలంలో పూర్తి ఆర్థిక సాయం అందించి బాధితులను ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.**

**మహేశ్వరం, జూలై 4, భారత శక్తి :**పేద ప్రజల అత్యవసర వైద్య చికిత్సల కోసం ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) మంజూరులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని మహేశ్వరం శాసనసభ్యురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. నియోజకవర్గ కేంద్రంలోని శాసనసభ్యురాలి నివాస కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి తాలూకా ఆర్థిక సహాయపు పత్రాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ఈ పథకం ఒక పెద్ద భరోసా అని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత పాలనలో ఈ నిధుల విడుదల

2లో..

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..
### కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

**న్యూఢిల్లీ (భారత శక్తి)** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు

2లో..



## స్పార్స 2026 భేటీలో
### పాల్గొన్న కేటీఆర్



**హైదరాబాద్ (భారత శక్తి)** ఫిల్మ్ నగర్లోని ఏఖీఅ కన్వెన్షన్లో జరిగిన 'స్పార్స - 2026' వార్షిక సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజ సేవకు అంకితమైన 'టచ్ ఏ లైఫ్' (ఠనీబీఇష్ట్ర జీ ఒతిటవ) థీమ్తో సాగుతున్న ఈ సంస్థ, మహిళల విద్య, స్కిల్ డెవలప్మెంట్ మరియు ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సమావేశంలో కేటీఆర్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. తన 50వ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆర్థికంగా వెనుకబడిన 50 మంది యువతుల చదువు మరియు సాధికారత బాధ్యతను స్వీకరించారు. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎవరైనా అవసరంలో ఉన్నప్పుడు సహాయం చేయడం మానవత్వమని, భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా కూడా ఇలాంటి సత్కార్యాలకు పూర్తి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## నిష్పాక్షిక ఎన్నికల్లో
# కమ్యూనికేషన్ పాత్రే కీలకం

- ప్రధాన ఎన్నికల కమిషనర్
- తప్పుడు ప్రచారాలపై ఉక్కుపాదం మోపాలి
- డిజిటల్ వేదిక 'ఈసీఐ నెట్' కు విస్తృత ప్రచారం కల్పించాలి.

**దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా న్యూఢిల్లీలో 'మీడియా & సమాచార నోడల్ అధికారుల జాతీయ సదస్సు' ఘనంగా నిర్వహించింది. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి సుమారు 240 మంది ప్రజా సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ బృందం చురుగ్గా పాల్గొంది.**




**న్యూఢిల్లీ జులై 4 భారతశక్తి,** న్యూఢిల్లీ వేదికగా 'మీడియా & సమాచార నోడల్ అధికారుల జాతీయ సదస్సు'నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు సమాచార వ్యవస్థే వెన్నెముక అని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు. సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం అందించే అధికారిక సమాచారాన్ని ప్రజల్లోకి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ముంచుకొస్తున్న తప్పుడు సమాచారం, అపోహలు, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సవాళ్లను సమర్థవంతంగా

2లో..

## రూ.20 కోట్ల పార్కు స్థలం స్వాధీనం
### కబ్జాదారులపై హైడ్రా కొరడా!

**- 1,970 గజాల లేఅవుట్ స్థలానికి ఫెన్సింగ్.. మేడ్చల్ మండలంలో భారీ ఆపరేషన్**

**హైదరాబాద్, జూలై 04 (భారత శక్తి ):**రాజధాని నగరంలో పార్కుల కబ్జాలను తొలగించి, కాలనీవాసులకు ప్రాణవాయువుతో పాటు సేదతీరేందుకు వీలుగా బహిరంగ ప్రదేశాలను పునరుద్ధరిస్తున్న హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పర్యవేక్షణ, రక్షణ సంస్థ (హైడ్రా) శనివారం మరో భారీ విజయాన్ని అందుకుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్ వేసిన సమయంలో పార్కుగా చూపి.. ఆ తర్వాత కాలక్రమేణా వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయించే అక్రమ వైనాన్ని హైడ్రా అధికారులు సమర్థవంతంగా అడ్డుకున్నారు. సుమారు రూ. 20 కోట్ల విలువైన 1,970 చదరపు గజాల

2లో..




## ముంబై రాజ్‌భవన్‌లో ప్రత్యేకంగా
### సమావేశమైన ఇరు రాష్ట్రాల గవర్నర్లు



**ముంబై/హైదరాబాద్: జూలై 4 భారతశక్తి** భారతదేశంలోని రెండు ప్రముఖ రాష్ట్రాల గవర్నర్లు శనివారం ముంబైలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముంబై పర్యటనలో భాగంగా అక్కడి రాజ్‌భవన్ (లోక్ భవన్)లో మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు గవర్నర్లు పరస్పరం కుశలప్రశ్నలు వేసుకుని, వివిధ అంశాలపై ఆత్మీయంగా చర్చించుకున్నారు. ఉభయ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, సమకాలీన పరిణామాలపైనా ఈ సమావేశంలో ప్రాధాన్యత లభించినట్లు తెలుస్తోంది. ఇరు రాష్ట్రాల ప్రథమ పౌరుల ఈ మర్యాదపూర్వక కలయిక సౌహార్ద వాతావరణంలో సాగింది.

# ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం

పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్ కింద 'అబు ముస్తఫా' అనే ఖాతా నుంచి బెదిరింపు కామెంట్ వచ్చింది. "ఈవెంట్ సమయంలో స్టేడియం పైకప్పులు మూసి ఉంచడం మంచిది. లేదంటే, ఆయన తన చావు కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని ఆ కామెంట్‌లో పేర్కొన్నారు. ఈ విషయం జూలై 3న ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే రంగంలోకి దిగిన దర్యాప్తు అధికారులు, బెదిరింపు పోస్ట్ చేసిన ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు సమాచారం. అయితే, దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ విషయంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి ఏఎఫ్‌పీ నిరాకరించింది. ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్లు ప్రకటించలేదు.ఆస్ట్రేలియా–భారత్ వార్షిక నాయకత్వ సదస్సు కోసం ప్రధాని మోదీ జూలై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, భద్రత, వాణిజ్యం వంటి కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ఆస్ట్రేలియా భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయన పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు.

# మీరు చాలా పాప్యులర్...
# ఉషా వాన్స్‌పై ట్రంప్ ప్రశంసలు

అన్నారు.అమెరికా సెకండ్ లేడీ హోదాలో ఉషా వాన్స్ నిర్వహిస్తున్న 'స్టోరీటైమ్ విత్ ది సెకండ్ లేడీ' కార్యక్రమం కోసం వారు ఓవల్ ఆఫీసులో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రంప్, ఉషా కలిసి వైట్‌హౌస్ హిస్టారికల్ అసోసియేషన్ ప్రచురించిన 'ప్రెసిడెంట్స్ ప్లే!' అనే పిల్లల పుస్తకాన్ని చదివారు. ఈ కార్యక్రమానికి తనను ఆహ్వానించడం గౌరవంగా భావిస్తున్నానని ట్రంప్ పేర్కొన్నారు. దీనికి ఉషా బదులిస్తూ, ఓవల్ ఆఫీసులోకి పిల్లలను ఆహ్వానించినందుకు అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను కూడా ట్రంప్ మెచ్చుకున్నారు. "మీ భర్త గొప్ప ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఎన్నో క్లిష్ట సమయాల్లో కూడా మేమిద్దరం కలిసి పనిచేస్తూ అనేక సమస్యలను పరిష్కరిస్తున్నాం" అని తెలిపారు. తన 11 మంది మనవళ్లు, మనవరాళ్లు ఈ కార్యక్రమాన్ని తప్పక చూసేలా చేస్తానని ట్రంప్ సరదాగా వ్యాఖ్యానించారు. భారత సంతతికి చెందిన తొలి అమెరికన్ సెకండ్ లేడీగా గుర్తింపు పొందిన ఉషా వాన్స్, వృత్తిరీత్యా న్యాయవాది. ఆమె పిల్లల్లో అక్షరాస్యత, విద్యను ప్రోత్సహించేందుకు ఈ పోడ్‌కాస్ట్ సిరీస్‌ను ప్రారంభించారు. ఇందులో భాగంగా పరిపాలనలోని ఉన్నతాధికారులను, ఇతర ప్రముఖులను అతిథులుగా ఆహ్వానిస్తున్నారు.

# ఈ నెల 20 నుంచి
# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి.ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్‌సీపీలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి.మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ–డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏఐటీయూసీ జిల్లా మహాసభని
# జయప్రదం చేయండి.

**గోరి కొత్త పల్లి లో హమాలీ, ఆటో, బిల్డింగ్**

**కార్మికులఆధ్వర్యంలో కరపత్రం విడుదల.**

**ముఖ్య అతిది గా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి**

**క్యాతారాజు సతీష్.**

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైండ్ల శాంతి కుమార్..**



రేగొండ, జూలై 4 (భారత శక్తి ) జులై 12 వ తేదీ న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లో జరిగే ఏఐటీయూసీ జిల్లా నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక గోరి కొత్త పల్లి మండలకేంద్రం లో కార్మికుల తో కలిసి కరపత్రం ఆవిష్కరణ చేసినారు అనంతరం మాట్లాడుతూ కార్మిక హక్కుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు చేస్తూ దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని 1920 అక్టోబర్ 31న ముంబై నగరంలోని ఏఐటీయూసీ ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక పోరాటాల్లో ముందు వరుసలో ఉండి కార్మిక సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళుతూ ఉందన్నారు నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పెట్టుబడిదారులకు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్పులు చేస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు కాంట్రాక్ట్ అవుట్ ఫోర్సింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తూ వెట్టి చాకిరి చేయిస్తుందన్నారు కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ అమలకు నోచుకోవడం లేదన్నారు అసంఘటితరంగా కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు జిల్లాలో ఉన్న కార్మికులందరూ పెద్ద ఎత్తున ఈ జిల్లా మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిల్డింగ్ రంగం అధ్యక్షులు పుట్ట సంపత్, హమాలిరంగం అధ్యక్షులు వైనాల ఐల్లయ్య, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పుట్ట రమేష్ తో పాటు సురేష్, క్యాతారాజు తిరుపతి, నగేష్, నాగార్జున, జగదీశ్, సారంగం, రాజు, రమేష్,శివశంకర్, ఈర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్య సహాయంలో జాప్యం తగదు





ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### నాటి వేగం.. నేటి ఆలస్యం!

గత భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ప్రభుత్వ హయాంలో, అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలో దరఖాస్తు చేసుకున్న మూడు నెలల లోపే బాధితులకు ఆర్థిక సహాయం అందేదని ఆమె గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం దరఖాస్తులు సమర్పించి తొమ్మిది నుండి పది నెలలు గడుస్తున్నా నిధులు మంజూరు కావడం లేదని ధ్వజమెత్తారు. దీనికి తోడు, ఆసుపత్రుల వైద్య ఖర్చులకు అనుగుణంగా రావాల్సిన సహాయంలో కూడా భారీగా కోత విధిస్తున్నారని ఆరోపించారు.

"ప్రజలు అత్యవసర చికిత్సల కోసం అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ప్రక్రియను వేగవంతం చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో, పూర్తి స్థాయిలో ఆర్థిక సహాయం అందించాలి."

**సబితా ఇంద్రారెడ్డి, మహేశ్వరం శాసనసభ్యురాలు**

### ప్రజల పక్షాన పోరాటం ఆపను..

మహేశ్వరం నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని, ప్రజా హక్కుల కోసం, సంక్షేమ ఫలాల కోసం ప్రభుత్వంతో పోరాడటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిష్పాక్షిక ఎన్నికల్లో
# కమ్యూనికేషన్ పాత్రే కీలకం




తిప్పికొట్టాల్సిన బాధ్యత నోడల్ అధికారులపైనే ఉందని ఆయన స్పష్టం చేశారు.

### ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక నిఘా

పౌరసత్వ చట్టం–1955 నిబంధనల ప్రకారం అర్హులైన భారతీయ పౌరులందరికీ ఓటు హక్కు కల్పించేలా 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ' ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఎన్నికలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంలో మీడియా అధికారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

### పారదర్శకత - సాంకేతికతపై ప్రత్యేక ప్రజెంటేషన్లు

ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్–324 ద్వారా ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, నిబంధనలపై సదస్సులో విస్తృతంగా చర్చించారు. లిఫారం–17సీ ప్రాధాన్యత:పోలింగ్ సరళి నమోదులో పారదర్శకత. లిపెయిడ్ న్యూస్ నియంత్రణ:డబ్బులు ఇచ్చి రాయించుకునే వార్తలకు అడ్డుకట్ట వేయడం.

### ఈసీఐ నెట్ విప్లవం:

ఓటరు నమోదు, వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఫలితాలను ఒకే డిజిటల్ వేదికపైకి తెచ్చిన విధానాన్ని అధికారులు వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడికి ఈ యాప్ చేరేలా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

### హాజరైన తెలంగాణ బృందం

ఈ జాతీయ సదస్సులో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, రాష్ట్ర మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు జిల్లా అధికారులు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.20 కోట్ల పార్కు స్థలం స్వాధీనం

పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకుని చుట్టూ రక్షణ కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేశారు.

### సాయి శ్రీ నిలయంలో లేఅవుట్ మాయాజాలం

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండల పరిధిలోని సర్వే నంబర్లు 873, 882 లలో 2000 సంవత్సరంలో 13.31 ఎకరాల విస్తీర్ణంలో 256 ప్లాట్లతో 'సాయి శ్రీ నిలయం' పేరిట ఒక నివాస స్థలాల లేఅవుట్ ఏర్పాటైంది. నిబంధనల ప్రకారం.. ఇందులో ప్లాట్ నంబర్లు 111, 112, 113, 114, 115, 116 ల పరిధిలోని 1,970 చదరపు గజాల విస్తీర్ణాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, ఈ ఖరీదైన స్థలంపై కన్నేసిన కొందరు అక్రమార్కులు, అందులోని సుమారు 400 చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించారు. దాన్ని తిరిగి ప్లాట్లుగా విభజించి, ముందస్తుగా సిద్ధం చేసిన కాంక్రీట్ దిమ్మెలతో (ప్రీకాస్ట్ కాంక్రీట్ బ్లాకులు) రక్షణ గోడను నిర్మించారు.

### ప్రజావాణి ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా

ఈ కబ్జా వ్యవహారంపై సాయి శ్రీ నిలయ నివాసితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రా 'ప్రజావాణి' (ప్రజా ఫిర్యాదుల విభాగం) లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే స్పందించిన హైడ్రా యంత్రాంగం.. రెవెన్యూ, పురపాలక తదితర సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఉమ్మడి పరిశీలన చేపట్టింది. విక్రయ పత్రాల (సేల్ డీడ్స్) ప్రకారం ఉన్న సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించి, అది ముమ్మాటికీ పార్కు స్థలమేనని నిర్ధారించుకుంది.

### కూల్చివేతలు.. బోర్డుల ఏర్పాటు:

కబ్జా నిజమేనని తేలడంతో శనివారం ఉదయాన్నే హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. పార్కు స్థలంలో అక్రమంగా నిర్మించిన కాంక్రీట్ ప్రహరీలను భారీ యంత్రాలతో కూల్చివేశాయి. అనంతరం పార్కు అసలు సరిహద్దులను పునరుద్ధరించి, అది ప్రభుత్వ పార్కు స్థలమేనని స్పష్టం చేస్తూ హెచ్చరిక బోర్డులను పాతారు. అక్రమ ఆక్రమణలు జరగకుండా స్థలం చుట్టూ బలమైన రక్షణ కంచెను ఏర్పాటు చేశారు. శనివారం స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ. 20 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### కాలనీవాసుల హర్షాతిరేకాలు

తమ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి విచారణ జరిపి నిమిషాల వ్యవధిలో చర్యలు తీసుకున్న హైడ్రా అధికారులకు సాయి శ్రీ నిలయ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఆక్రమణలను తొలగించి, బోర్డులు నాటడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలను అభినందించారు.

# కల్తీలపై ఉక్కుపాదం

సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కదలాలని పేర్కొన్నారు.

### కీలక నిర్ణయం: ఏకతాటిపైకి రెండు విభాగాలు

ఇప్పటివరకు విడివిడిగా పనిచేస్తున్న ఔషధ నియంత్రణ, ఆహార భద్రతా విభాగాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు (విలీనం చేసేందుకు) తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రెండు విభాగాలు కలిసి పనిచేస్తే మరింత సమర్థవంతంగా ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం

ఆహార భద్రత, కల్తీల నియంత్రణలో ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, మన రాష్ట్రంలోనూ వాటిని అమలు చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కల్తీ కేసులు, వాటి పురోగతి, అందుబాటులో ఉన్న సిబ్బంది కొరత తదితర కీలక అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

### హాజరైన ఉన్నతాధికారులు

ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్–అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, రాష్ట్ర పోలీస్ గరిష్ట అధికారి (డిజిపి) సి.వి.ఆనంద్, ముఖ్యమంత్రి కార్యాలయ (సిఎంఒ) ప్రధాన కార్యదర్శులు శేషాద్రి, ఎన్.శ్రీధర్, సాధారణ పరిపాలనా శాఖ (జిఎడి) ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీం పాల్గొన్నారు. వీరితో పాటు అదనపు డిజి (ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీతా, ఔషధ నియంత్రణ విభాగం డైరెక్టర్ జనరల్ అవినాష్ మొహంతి తదితరులు పాల్గొన్నారు.

## మిగులు బడ్జెట్‌తో అప్పగిస్తే.. అప్పుల రాష్ట్రంగా మార్చారు



ప్రజాపాలన పోవాలా? గంజాయి,డ్రగ్స్‌ను నియంత్రించినందుకు ప్రజాపాలన పోవాలా?.. మీ దోపిడీకి అడ్డుకట్ట పడినందునే.. ప్రజాపాలన పోవాలని కోరుకుంటున్నారు. ప్రతిదాంట్లో కమీషన్లు తిన్నారు. బతుకమ్మ చీరల్లోనూ అవినీతికి పాల్పడ్డారు'.. 'కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు పెరిగితే.. తెలంగాణకు అప్పులు మాత్రమే మిగిలాయి. కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. సమస్యలపై ప్రతిపక్ష నేత మాట్లాడరంట. అధికారం ఇస్తే దోచుకోవడానికి మాత్రం వస్తారట. వాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఆలోచించాలి. అరుంధతి సినిమాలో పశుపతిలా.. కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటికొచ్చే పరిస్థితి లేదు. బీఆర్ఎస్‌కు అధికారం అన్నది కలే. బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్ లేదు. మళ్లీ కాంగ్రెస్ రావాలి. రాహుల్ ప్రధాని కావాలి. రాహుల్‌ను ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది' అని అన్నారు.

# రాష్ట్రంలో వరల్డ్ క్లాస్
# స్పోర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ... గతంలో ఆంధ్రప్రదేశ్ లో మంచి కోచ్ లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబుగారు విదేశీ కోచ్ లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటుచేశారని అన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ... పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి అత్యుత్తమ కోచ్ లను ఏపీలో ఏర్పాటుచేసి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తీసుకొస్తామని అన్నారు.

రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల కల్పనకు జెఎస్ డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారని అన్నారు.రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్ పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ ఎరెనా ఉండాలన్నది తమ అభిమతంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ ను ప్రోత్సహించడంపై తల్లిదండ్రుల్లో కూడా అవేర్‌నెస్ రావాల్సి ఉందని అన్నారు. ఇందులో భాగంగానే గతఏడాది నిర్వహించిన డీఎస్సీలో తొలిసారిగా క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని అన్నారు. విశాఖ క్రికెట్ స్టేడియంలో ఒక స్టాండ్ కు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరుపెట్టామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థుల ఆసక్తిమేరకు వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

భారత శక్తి

ఆదివారం, జూలై 5, 2026

## మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హయత్‌నగర్ సర్కిల్ పర్యటన



**ఎల్బీనగర్, జూలై 04 (భారత శక్తి):**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్, హయత్‌నగర్ సర్కిల్--14 పరిధిలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో భాగంగా చేపట్టిన తనిఖీలు మరియు జారీ చేసిన ఆదేశాలు... గుంటి జంగయ్య కాలనీలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ)ను పరిశీలించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. జీవీపీ చుట్టుపక్కల ఉన్న చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, జీవీపీ వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దాతలను గుర్తించి చర్యలు చేపట్టాలని సూచించారు.జహంగీర్ నగర్ కాలనీలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ)ను పరిశీలించి, జీవీపీ పరిసర ప్రాంతాల్లోని వాణిజ్య సంస్థల సహకారంతో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను కూడా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జీవీపీ)ను పరిశీలించి పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు.హరిహరపురంలోని నాలాను పరిశీలించి, అందులో పేరుకుపోయిన సిల్ట్‌ను వారం రోజుల్లో పూర్తిగా తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.గుర్రంగూడ అర్బన్ ఫారెస్ట్ కుంటను పరిశీలించగా దోమల ఉత్పత్తి కేంద్రాన్ని గుర్తించారు. దోమల వ్యాప్తి నివారణకు వారానికి రెండు సార్లు ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు అవసరమైన అన్ని నివారణ చర్యలను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పట్టణ జీవ వైవిధ్య విభాగం (యూబీడి) అధికారులకు కాలనీల్లో ఎత్తైన మొక్కలను నాటేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల (=ఔూం)తో సమావేశాలు నిర్వహించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ నగరాన్ని పరిశుభ్రంగా, హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమీషనర్ ఎ. స్వామి,ఎల్. నాగేందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శ్రీమతి విజయలక్ష్మి, అసిస్టెంట్ సిటీ ప్లానర్, బి. కనకయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం), లక్ష్మీ దీపక్, అసిస్టెంట్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం),లోకేష్ కుమార్, యూబీడీ మేనేజర్ రామ్‌కీ సంస్థ నాగులపాటి భారత్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైభవంగా వైభవ్-లక్ష్మీల వివాహం

### నూతన వధూవరులను ఆశీర్వదించిన చిగిరింత నరసింహారెడ్డి



**బడంగ్‌పేట్: జూలై 4 భారత శక్తి** బడంగ్‌పేట్ పరిధిలోని సాయి నగర్ నివాసి ఉత్తమ్ కుమారుడు వైభవ్, లక్ష్మీల వివాహ మహోత్సవం మహారాష్ట్రలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి,ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ శుభకార్యానికి చిగిరింత నరసింహారెడ్డితో పాటు బడంగ్‌పేట్ ప్రాంతానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రముఖుల రాకతో సాయి నగర్ పరిసర ప్రాంతాల్లో పండగ వాతావరణం నెలకొంది. వధూవరుల కుటుంబ సభ్యులు అందరికీ ఘనంగా స్వాగతం పలికారు.

## 'రిపోర్టర్ మహిపాల్ రెడ్డి మాతృమూర్తికి పారిజాత నర్సింహారెడ్డి నివాళి'



**బడంగ్పేట్ జులై 4 భారత శక్తి,** 'నాదర్గుల్‌లో దశదిన కర్మ' కార్యక్రమంమహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలో గల నాదర్గుల్ డివిజన్ తోట జంగారెడ్డి గార్డెన్స్‌లో ఈనాడు పత్రిక రిపోర్టర్ కందాడి మహిపాల్ రెడ్డి మాతృమూర్తి దశదిన కర్మ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. మహిపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి మాతృమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, విలేకరులు కూడా పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## ఎల్బీనగర్ జోన్ పరిధిలోని రూ.23 కోట్ల

# ఆర్&బి రోడ్ల పనులు వేగవంతం చేయాలి

**- రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి**

**- ఈ నెల 7న తొర్రూర్‌లో రూ.338 కోట్లతో హ్యామ్ రోడ్లకు శంకుస్థాపన చేయనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**ఎల్ బీ నగర్ జులై 04 (భారత శక్తి ):**ఎల్బీనగర్ జోన్ పరిధిలో రూ.23 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఆర్‌డబీ రహదారుల అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ఐఏఎస్ వికాస్ మహతో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి హాజరై సంబంధిత శాఖల అధికారులతో పనుల పురోగతిని సమీక్షించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. హైదరాబాద్ నగర శివారు ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రహదారుల విస్తరణ, ఆధునికీకరణ, కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా రహదారుల నిర్మాణంలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యాన్ని సహించబోమని అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ప్రత్యామ్నాయ మార్గాలు, భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, అటవీ, టౌన్ ప్లానింగ్, జీహెచ్ఎంసీ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి అనుమతులు, యుటిలిటీ షిఫ్టింగ్, సాంకేతిక అంశాల కారణంగా ఎక్కడా పనులు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు.అదేవిధంగా మన ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో కీలక ముందడుగుగా రూ.338 కోట్ల వ్యయంతో హ్యామ్ (హమ్) విధానంలో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు ఈ నెల 7వ తేదీన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్‌లో గౌరవ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ ప్రాజెక్టు పూర్తయితే ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నాగోల్ డీసీ సంపత్ కుమార్, ఎల్బీనగర్ జోన్ సీపీ (టౌన్ ప్లానింగ్) శ్రీనివాస్ యాదవ్, ఎల్బీనగర్ జలమండలి జీఎం మహేందర్ నాయక్, డీజీఎంలు సాయినాథ్, నాగరాజు, ఆర్‌డబీ ఈఈ రమేష్, డీఈ బాలు నాయక్ గారు, ఏసీపీలు విజయలక్ష్మి, ప్రతాప్, విద్యుత్ శాఖ డీఈ ఫర్హత్ అలీ, తదితర శాఖల అధికారులు, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# స్వేచ్ఛ నివాస్‌కు శాశ్వత మురుగునీటి ముక్తి!

**- ఉప శీర్షిక: రూ.2 కోట్లతో మురుగునీటి పనులకు శంకుస్థాపన చేసిన శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి.. కాలనీల సమగ్ర అభివృద్ధికి హామీ!**



**మహేశ్వరం జులై 4 (భారత శక్తి):**మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని నివాసితులకు దశాబ్దాలుగా వేధిస్తున్న మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నాదర్‌గుల్ 57వ విభాగం పరిధిలోని అల్మాస్‌గూడ స్వేచ్ఛ నివాస్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన మురుగునీటి సమస్యను తుడిచిపెట్టేందుకు ముమ్మర అడుగులు పడ్డాయి. ఈ మేరకు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మురుగునీటి కాల్వల (డ్రైనేజీ) అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యురాలు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.

### రూ.2 కోట్లతో మురుగునీటి అవుట్‌లెట్.. మరిన్ని నిధులకు ప్రణాళికలు

ఈ సందర్భంగా శాసనసభ్యురాలు మాట్లాడుతూ.. వినాయక్ హిల్స్‌తో పాటు దాని పరిసర కాలనీల్లో నెలకొన్న మురుగునీటి సమస్యలను మూలాల్లోంచే నిర్మూలించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. స్థానిక చెరువుకు మురుగునీటి అవుట్‌లెట్ (బహిర్గత ద్వారం) ఏర్పాటు కోసం ఇప్పటికే రూ.2 కోట్లతో కూడిన పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని వివరించారు. దీనికి అదనంగా, మరో రెండు అనుబంధ పనుల కోసం కూడా త్వరలోనే రూ.2 కోట్ల చొప్పున నిధులు మంజూరు కానున్నాయని కాలనీవాసులకు స్పష్టం చేశారు.

### మౌలిక వసతుల కల్పనే ధ్యేయం -- వడివడిగా అడుగులు

ఈ ప్రతిపాదిత పనులు పూర్తయితే వర్షాకాలంలో వీధుల్లో నీరు నిల్వ ఉండే దుస్థితి తప్పడమే కాకుండా, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజాప్రతినిధి ఆశాభావం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనాపరమైన సాంకేతిక ప్రక్రియల కారణంగా కొన్ని పనులు కొంత ఆలస్యమైనప్పటికీ, ప్రస్తుతం పనుల్లో వేగం పెంచినట్లు తెలిపారు. ఇన్నాళ్లూ ఓర్పుతో సహకరించిన కాలనీ ప్రజలకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.వినాయక్ హిల్స్ రెండో దశ (ఫేజ్--2) పరిధిలోని అంతర్గత రహదారుల (సబ్ రోడ్ల) నిర్మాణంతో పాటు, మిగిలిన అన్ని మౌలిక వసతుల పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గవ్యాప్తంగా మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, నీటి నిల్వ జలాశయాలు (రిజర్వాయర్లు), ప్రధాన రహదారుల వంటి ఎన్నో మౌలిక వసతులను కల్పించామని గుర్తు చేస్తూ, మిగిలిపోయిన పనులను సైతం త్వరితగతిన పూర్తి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని స్పష్టం చేశారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి:

అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలకు తావుండకూడదని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు చూసుకోవాలే తప్ప, ప్రజల ప్రయోజనాలను, ప్రాంతీయ అభివృద్ధిని రాజకీయాలకు బలి చేయవద్దని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు, స్థానికులకు విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా చెరువుల పరిరక్షణ, నిర్వహణపై ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

గతంలో చెరువుల సుందరీకరణ (బ్యూటిఫికేషన్) ప్రాజెక్టుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లు (నడకదారులు), విద్యుత్ దీపాలు (లైటింగ్) తదితర వసతులను సక్రమంగా పర్యవేక్షించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మంజూరైన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కోరారు.

### భారీగా తరలివచ్చిన శ్రేణులు, స్థానికులు:

ఈ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్లు బోయపల్లి శేఖర్ రెడ్డి, సమ్ రెడ్డి వెంకట్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, ముత్యాల కృష్ణ, జాలే సరిత రెడ్డి, ఆకుల సరిత, గీతా, గాయత్రితో పాటు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నగర సుందరీకరణే లక్ష్యం

**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి..**

**- పారిశుద్ధ్యం, నాలాల పూడికతీతపై కమిషనర్ సీరియస్**

**- హయత్‌నగర్ సర్కిల్‌లో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ**

**- వ్యర్థాల ప్రాంతాల (జీవీపీ) వద్ద సీసీ కెమెరాలు, పచ్చదనం పెంపునకు ఆదేశం**

**- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులకు హెచ్చరిక**



**హైదరాబాద్ (మల్కాజిగిరి), జూలై 4: భారత శక్తి,** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హయత్‌నగర్ సర్కిల్--14 లో మున్సిపల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి శనివారం ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు, నాలాల నిర్వహణ, దోమల నివారణ చర్యలను ఆయన నిశితంగా పరిశీలించారు. విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### కమిషనర్ పర్యటన విశేషాలు, జారీ చేసిన కీలక ఆదేశాలు ఇలా ఉన్నాయి:

### వ్యర్థాల ప్రాంతాల (జీవీపీ) ప్రక్షాళన -- సీసీ కెమెరాల ఏర్పాటు

గుంటి జంగయ్య కాలనీలోని ప్రధాన చెత్త ఉంచే ప్రాంతాన్ని (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్) పరిశీలించిన కమిషనర్, అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. మళ్లీ అక్కడ చెత్త వేయకుండా నిరోధించేందుకు దాతల సహకారంతో ముఖాముఖి నిఘా కెమెరాలు (సీసీ కెమెరాలు) ఏర్పాటు చేయాలని సూచించారు. జహంగీర్ నగర్ కాలనీలోని వ్యర్థాల ప్రాంతాన్ని పరిశీలించి, స్థానిక వాణిజ్య సంస్థల భాగస్వామ్యంతో అక్కడ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యతలను కూడా ఆయా సంస్థలకే అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న చెత్త ప్రాంతాన్ని కూడా పరిశీలించి పారిశుద్ధ్య మెరుగుదలకు పలు సూచనలు చేశారు.

### వారం రోజుల్లో నాలా పూడికతీత పూర్తి కావాలి

హరిహరపురంలోని నాలాను పరిశీలించిన కమిషనర్, అందులో పేరుకుపోయిన పూడిక (సిల్ట్)పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, వారం రోజుల్లోగా నాలాలోని పూడికను పూర్తిగా తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు.

### గుర్రంగూడ కుంటలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

గుర్రంగూడ పట్టణ అటవీ ప్రాంతంలోని (అర్బన్ ఫారెస్ట్) కుంటను పరిశీలించిన క్రమంలో అక్కడ దోమల ఉత్పత్తి కేంద్రాన్ని కమిషనర్ గుర్తించారు. దోమల వ్యాప్తి వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున, నివారణ చర్యగా వారానికి రెండు సార్లు తైలపు గుళికలు (ఆయిల్ బాల్స్) వేయాలని, ఫాగింగ్ వంటి ఇతర నివారణ చర్యలను తక్షణమే వేగవంతం చేయాలని ఆరోగ్య విభాగాన్ని ఆదేశించారు.



### నివాసితుల సంఘాల (ఆర్‌డబ్ల్యూఏ) సహకారంతో పచ్చదనం

పట్టణ జీవ వైవిధ్య విభాగం (యూబీడీ) ఆధ్వర్యంలో నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కాలనీల్లో ఎత్తైన మొక్కలను నాటేందుకు స్థానిక నివాసితుల సంక్షేమ సంఘాలతో (రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్) ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రజలను భాగస్వామ్యం చేయాలని స్పష్టం చేశారు.

### కమిషనర్ హెచ్చరిక:

"నగరాన్ని పరిశుభ్రంగా, హరితవనంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. ప్రజల భాగస్వామ్యంతో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ, పచ్చదనం పెంపు కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు." ఈ క్షేత్రస్థాయి పర్యటనలో డిప్యూటీ కమిషనర్ ఎ. స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. నాగేందర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఘన వ్యర్థాల నిర్వహణ) బి. కనకయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీ దీపక్, యూబీడీ మేనేజర్ లోకేష్ కుమార్ మరియు రామ్‌కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉషోదయ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవ మహోత్సవాలు



గాజులరామారం, జూలై04: ఈరోజు గాజులరామారం పరిధిలోని ఉషోదయ కాలనీలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించిన బ్రహ్మోత్సవ మహోత్సవాల్లో ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీస్సులు పొందారు. అనంతరం కోలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, స్వామి వారి కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, సుభిక్షం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

## కౌడిపల్లిలో జర్నలిస్టు బర్లరాజు రెండవ వర్ధంతి కార్యక్రమం

- కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ కార్యక్రమం్న
- రాజు మృతి కుటుంబానికి తీరని లోట్ను
- ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు చార్ని



మెదక్ జిల్లా కౌడిపల్లి, జూలై 04 (భారత శక్తి న్యూస్): మెదక్ జిల్లా మండల కేంద్రమైన కౌడిపల్లి లో జర్నలిస్టు బర్లరాజు రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మొదటగా వారి స్వగృహంలో రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ స్మృతి, చేతుల మీదుగా పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రామానంద చటర్జీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నాగరాజు చారి మాట్లాడుతూ ఓరుగల్లు నైన్ న్యూస్ లో జర్నలిస్టుగా వీధులు నిర్వహిస్తూ గత రెండు సంవత్సరాల క్రితం ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి దర్శన నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు డ్యాంలో పడి నీట మునగి మరణించడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. ఆయన జర్నలిస్టుగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి అందించిన సేవలు మరువలేని అన్నారు. రాజు మరణం కుటుంబానికి తీరనిలోటు అన్నారు. అనంతరం రాజు సగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షులు చంద్రం కిషోర్ గౌడ్, కారోబర్ ఎల్లం, ఓం విశ్వకర్మ టీవీ ఛానల్ ఎండి కొండోజు నరసింహ చారి, తోపాటు కుటుంబ సభ్యులు, రాజు స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

## జైన గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, జూలై 4 (భారత్ శక్తి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి మండలం జైన గ్రామంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అంబేద్కర్ చూపిన మార్గం దేశానికి ఆదర్శమని, సమానత్వం, సామాజిక న్యాయం, విద్య ద్వారా సాధికారత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు రుణమాఫీ, సన్నధాన్యానికి బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని సామాజిక అసమానతల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు,వివిధ ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీఆర్సీ రిపోర్టు విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలి తపస్



జగిత్యాల, జూలై 4( భారత శక్తి ప్రతినిధి ): పీఆర్సీ రిపోర్టును వెంటనే విడుదల చేసి 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్మపురి మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని, బకాయి ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, కేజీబీవీ ఉద్యోగులకు ఎంటీఎస్ స్కేలు వర్తింపజేయాలని, మోడల్ స్కూల్ ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలు చెల్లించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు వార్షిక క్యాలెండర్ రూపొందించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొరపురెడ్డి శ్రీనివాసరావు, జిల్లా బాధ్యులు బండి మహేష్, కాశెట్టి రమేష్, బక్కశెట్టి రవీందర్, ద్యావనపల్లి విష్ణు, శీలం రాజేష్, బండి ప్రవీణ్, కనపర్తి సంతోష్, కాశెట్టి శ్రీనివాస్, బుగ్గారపు హరీష్, కాశెట్టి వెంకటరమణ, గొల్లపెల్లి రాజేశ్వర్, సందుపట్ల రమేష్, చల్ల కృష్ణ, అప్సర్, పోచన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

# కోటంచ ఆలయానికి రూ 51 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం.


**- హోలీ పండుగ నాటికి పనులు పూర్తి. - భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు.**



రేగొండ,జులై 4(భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ గ్రామంలోని సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి మరో రూ 51 కోట్ల నిధులతో యాద్రాద్రిల అభివృద్ధి నిర్మాణ పనులను చేపట్టుతున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు.నిర్మాణ పనులు వచ్చే హోలీ పండుగ నాటికి పూర్తి చేస్తామని, ఇప్పటికే ఆలయ పునర్ ప్రతిష్ట అభివృద్ధి పనులకు రూ.12 కోట్ల 15 లక్షల వ్యయంతో పూర్తి చేశామన్నారు.ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ధర్మాదాయ స్థపతి వల్లి నాయక్, ఇంజనీర్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి కోటంచ ఆలయాన్ని సందర్శించారు. ముందుగా ఎమ్మెల్యే గండ్ర బృందానికి ఆలయ ఈవో బిల్లా శ్రీనివాస్, చైర్మన్ నాయినేని సంపత్ రావు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర అధికారులతో కలిసి ఆలయ గెస్ట్ హౌస్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..

బాసర పుష్కరాల నిధులతో పాటు కోటంచ ఆలయానికి మరో రూ.51 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని,ఈ నిధులతో చేపట్టే రాజగోపాలం, ఆర్చి, కొలను వంటి అభివృద్ధి నిర్మాణ పనులను వచ్చే మార్చి హోలీ పండుగ వరకు పూర్తి చేసి మరో యాద్రాద్రిల దిద్దుతామని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు. రూ 51 కోట్లతో చేపట్టే పనులను సకాలంలో అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఆలయ అభివృద్ధికి ప్రజల సహకారం అందజేయాలని ఎమ్మెల్యే గండ్ర కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు, తెలంగాణ దేవాదాయ - ధర్మదాయ స్థపతి వల్లి నాయక్,నాయినేని సంపత్ రావు, ఈవో శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎస్ ఇ కె. దుర్గ ప్రసాద్, డి ఇ ఇ రమేష్ బాబు , ఏ ఇ లు మరియు =ఒదీ శాఖ ఇంజనీరింగ్ విభాగం రాజు రమేష్ బాబు, డిఇ ఎండీ గౌస్, ఏఇ నవీన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ చావటి మొగిలి, మీనా సురేష్, మాజీ సర్పంచ్ కట్ల మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, మాదటి కరుణాకర్ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్ వెండి ఆభరణాల స్వాధీనం



జగిత్యాల, జూలై 4 (భారత్ శక్తి): ధర్మపురిలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇంటి చోరీ కేసును పోలీసులు ఛేదించి, ఒడిశాకు చెందిన అంతర్రాష్ట్ర నిందితుడు రెహ్మాన్ బాక్స్ (30)ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించిన పోలీసులు, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి పర్యవేక్షణలో, సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి సూచనలతో ఎస్సై జి. మహేష్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం ఒడిశాలో నిందితుడిని అదుపులోకి తీసుకుని ట్రాన్సిట్ రిమాండ్‌పై ధర్మపురికి తరలించి న్యాయస్థానం ముందు హాజరుపరిచింది. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు జి. మహేష్, రవీందర్, పీసీలు కిరణ్, రణధీర్‌లను ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి అభినందించారు.

## తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,జూలై 4: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్,జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్ ఉప్పల రమేష్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి, కంచకట్ల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి, మన్యం యాదగిరి, దున్న శ్యామ్, జిల్లా కార్యదర్శి టీఎన్జీవోస్ యూనియన్,స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్ వీసా ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్ రిమాండ్ తరలింపు




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 04:పాముల సతీష్, తండ్రి కాశయ్య ,వయస్సు 38 సంవత్సరాలు, కులం గౌడ్, గ్రామం నారాయణపూర్ ఎల్లారెడ్డిపేట మండలం అను అతను దుబాయ్ వెళ్లడానికి చెట్పల్లి శ్రీనివాస్,తండ్రి నారాయణ ,వయస్సు 46 సంవత్సరాలు, కులం మంగలి, గ్రామం తిమ్మాపూర్ ఎల్లారెడ్డిపేట మండలం, ప్రస్తుతం జగిత్యాల అను గల్ఫ్ ఏజెంట్ ని కలవగా అతడు దుబాయ్ దేశంలో పని చేయుటకు తన వద్ద వీసా ఉందని అందుకు కొన్ని డబ్బులు ఖర్చు అవుతాయని తెలుపగా పాముల సతీష్ 30 వేల రూపాయలు చెట్పల్లి శ్రీనివాస్ కు ఇచ్చినాడు. కానీ పాముల సతీష్ కు అతడు ఎలాంటి వీసా ఇప్పించకుండా డబ్బులు తీసుకొని చెట్టుపల్లి శ్రీనివాస్ మోసం చేసినాడని పాముల సతీష్ భార్య అయిన పాముల చైతన్య ఇచ్చిన దరఖాస్తు పై ఎల్లారెడ్డిపేట ఎస్సై కె .రాహుల్ రెడ్డి కేసు నమోదు చేసి, నిన్న చెట్పల్లి శ్రీనివాసును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా గౌరవ మెజిస్ట్రేట్ అతనికి రిమాండ్ విధించినారు.అంతేకాకుండా చెట్పల్లి శ్రీనివాస్ జనవరి నెలలో గల్ఫ్ పంపిస్తానని ఒకరి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేయగా అతనిపై వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు చేసారు.

## పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగు ను ప్రోత్సహించాలి.

**కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి.**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 04 (భారత శక్తి )పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేలా రైతులను అధికారులు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సీఎస్ సంజయ్ జాజు శనివారం హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వ్యవసాయ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు. యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు. ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతం తో మొదటి స్థానంలో ఉందని అన్నారు.వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఆయిల్ పామ్ పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మండలాల వారిగా లక్ష్యాలను చేరుకునేందుకు ప్రణాళికలను అమలుపరుస్తున్నామని చెప్పారు. రైతుల అవసరాల మేరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. కాలానుగుణ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశామని, వైద్య శాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ వీసీలో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మీ పాత బ్యాంక్ అకౌంట్స్‌లో ఉన్న డబ్బుని మర్చిపోయారా?



మీ సొమ్ముని తిరిగి పొందడానికి ఆర్‌బిఐ మీకు సహాయపడుతుంది.

మీ బ్యాంకులో ఉన్న (2 సంవత్సరాలకు పైగా మరియు 10 సంవత్సరాల వరకు నిష్క్రియంగా ఉన్న) ఉపయోగంలో లేని ఖాతాలలోని డబ్బు / క్లెయిమ్ చేయని డిపాజిట్లు (10 సంవత్సరాలకు పైగా) ఆర్‌బిఐ యొక్క డిఇఏ ఫండ్‌కి బదిలీ చేయబడుతుంది. మీరు లేదా మీ చట్టపరమైన వారసులు ఎప్పుడైనా దాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.

मीया

మీ డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి 3 సులభమైన విధానాలు

1. మీ రెగ్యులర్ బ్రాంచ్ కాకపోయినా, ఏదైనా మీ బ్యాంక్ బ్రాంచ్‌ని సంప్రదించండి.
2. కెవైసి పత్రాలతో (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడి లేదా డ్రైవింగ్ లైసెన్స్) ఫారమ్‌ను సమర్పించండి.
3. ధృవీకరణ తర్వాత మీ డబ్బును వడ్డీతో సహా స్వీకరించండి.




మీ క్లెయిమ్ చేయని డిపాజిట్లను కనుగొనడానికి

మీ బ్యాంక్ వెబ్‌సైట్‌లో వెతకండి లేదా ప్రస్తుతం 30 బ్యాంకులను కలిగి ఉన్న ఆర్‌బిఐ యొక్క UDGAM పోర్టల్ (https://udgam.rbi.org.in) లో చూడండి.

మరిన్ని వివరాల కోసం, https://rbikehtahai.rbi.org.inని సందర్శించండి
అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకు వ్రాయండి.
క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి
అధికారిక వాట్సాప్ నం. 9990041935

ప్రజా హితార్థం జారీ చేయబడింది
भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులకు కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఘన సత్కారం



కుత్బుల్లాపూర్, భారత శక్తి ప్రతినిధి, జూలై 04: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన పలు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈ రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన సాయిబాబా నగర్ డివిజన్ అధ్యక్షులు అకుల హరి కిరణ్, బహదూర్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మైసిగరి శ్రీనివాస్, పేట్ బషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, కొంపల్లి డివిజన్ అధ్యక్షులు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి, బాచుపల్లి డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మహాదేవపురం డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షురాలు హైమావతి, కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ ముదిరాజ్, దూలపల్లి డివిజన్ అధ్యక్షులు బైరి శివకుమార్ గౌడ్, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు, సూరారం డివిజన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, గణేష్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఇరుగు రాధ క్రిష్ణ, షాపూర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాలకృష్ణ, చింతల్ డివిజన్ అధ్యక్షులు జలీల్ ఖాన్, బౌరంపేట్ డివిజన్ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు ద్వారంపూడి నాగిరెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్ లు కలిసారు.అనంతరం హన్మంతన్న నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులను శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ప్రతి డివిజన్ అధ్యక్షుడి ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకొని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాహిత కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొంటూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరూ సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త తన వంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ విప్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రెస్ క్లబ్ కార్యవర్గం

**ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రభుత్వ విప్ ఆది అభినందనలు.**

**శాలువాలతో ఘన సన్మానం.**

**పాత్రికేయుల సంక్షేమానికి సహకారం అందిస్తామని హామీ.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 04:తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ల నేతృత్వంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను ఆది శ్రీనివాస్ శాలువాలు కప్పి సన్మానిస్తూ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలను నిష్పాక్షికంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ పాత్రికేయుల సంక్షేమం, వృత్తి విలువల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారం, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు..అనంతరం పట్టణంలోని ప్రెస్ భవనంలో వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులకు అవకాశం కల్పించాలని విప్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో గౌరవ సభ్యులు కొత్వల్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిహెచ్ దేవరాజ్, విష్ణు,క్యాషియర్ పంపరి నాగరాజు, జిల్లా రమేష్, ఫహద్, చౌటపల్లి వెంకటేష్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు,సంటి రాజేందర్ షబ్బీర్, నవీన్, బూర్ల ప్రదీప్, బండి రజిని, బుర్ల సందీప్, లక్ష్మీనారాయణ,వేణు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఈత చెట్లు కూల్చరాదు

**- గీత కార్మికుల జీవనాధారాన్ని దెబ్బతీస్తే కఠిన చర్యలు**

**- ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా**



మెదక్ జిల్లా కౌడిపల్లి, జూలై 04 (భారత శక్తి న్యూస్): అనుమతులు లేకుండా ఈత చెట్లను నరికినా, కూల్చివేసినా చట్టపరమైన చర్యలు తప్పవని నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా హెచ్చరించారు. కౌడిపల్లి మండలం రాజీపేట గ్రామంలో అనుమతులు లేకుండా ఈత చెట్లను జేసీబీ సహాయంతో తొలగించిన ఘటనపై ఎక్సైజ్ శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. గ్రామానికి చెందిన వడ్ల ప్రభుచారి తన పొలం గట్టు వెంబడి ఉన్న ఈత చెట్లను తొలగించడంతో రాజీపేట గౌడ సంఘం సభ్యులు ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా గులాం ముస్తఫా మాట్లాడుతూ, ఈత చెట్లు గీత కార్మికుల జీవనాధారమని, వాటిని అక్రమంగా తొలగించడం వల్ల వారి ఉపాధికి తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అనుమతులు లేకుండా ఈత చెట్లను నరికినా, కూల్చివేసినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968 నిబంధనలు, ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎక్కడైనా అనుమతి లేకుండా ఈత చెట్లను తొలగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి సతీష్ (ట్రైనీ), ఎక్సైజ్ ఎస్సై రాఘవేంద్రరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు.






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 04 (భారత శక్తి) : సారంగాపూర్ ఎం.జే.పి.టి.బి.సి సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, భోజనశాల, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులతో మమేకమై వారి చదువు, ఆరోగ్యం, వసతి, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన అదనపు కలెక్టర్, వారికి అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారం అందించేలా నిరంతరం శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సంబంధిత అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలు పెరిగే విధంగా చదువు చెప్పాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**





నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 04 (భారత శక్తి ) విద్యార్థుల నైపుణ్యాలు పెరిగే విధంగా విద్యాబోధన సాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, శుక్రవారం రాత్రి నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన ఆహారం, వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగే విధానాలను అనుసరిస్తూ ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ, ఇప్పటివరకు నేర్చుకున్న సబ్జెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల పదాలకు సంబంధించి విద్యార్థులతో ఆటలను ఆడించారు. ఈ తనిఖీలో డిటిడిఓ అంబాజీ, తహసిల్దార్ ప్రభాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించుకుందాం..!

కుత్బుల్లాపూర్, జూలై 04(భారత శక్తి ):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బోనాల మహోత్సవాల నిర్వహణకు అర్హత కలిగిన అమ్మవారి ఆలయాలకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అర్హత కలిగిన అన్ని అమ్మవారి ఆలయ కమిటీలు 2026 జూలై 5వ తేదీలోగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**- తప్పనిసరిగా జతపరచాల్సిన పత్రాలు:**

- కమిటీ లెటర్‌హెడ్‌పై వినతిపత్రం
- కమిటీ బ్యాంకు ఖాతా వివరాలు (పాస్‌బుక్/అకౌంట్ కాపీ)
- కమిటీ సభ్యుల ఆధార్ కార్డు ప్రతులు
- ఆలయానికి సంబంధించిన 3 ఫొటోలు
- ప్రతి పత్రంపై కమిటీ అధికారిక ముద్ర (స్టాంపు) మరియు కమిటీ ప్రతినిధుల సంతకాలు

అర్హత కలిగిన ప్రతి అమ్మవారి ఆలయ కమిటీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పొందాలని, బోనాల మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించాలని కొలన్ హన్మంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా - వెలుగు వెంకన్న



సూర్యాపేట (భారతశక్తి ప్రతినిధి) జూలై 4:కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షులుగా జిల్లా కేంద్రానికి చెందిన 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న నియామకమయ్యారు. 2000 సంవత్సరంలో పెద్దిరెడ్డి రాజా ఆధ్వర్యంలో టీడీపీలో పనిచేసిన ఆయన 2016 నుంచి పటేల్ రమేష్ రెడ్డితో కలిసి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. 2014లో టీడీపీ పట్టణ కార్యదర్శి పని చేశారు. 2014లో టీడీపీ పార్టీ తరఫున ఆయన సతీమణి వెలుగు సంతోషి కౌన్సిలర్‌గా గెలుపొందారు. 2017లో పటేల్ రమేష్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2019, 2026 సంవత్సరంలో 48వ వార్డు కౌన్సిలర్ గా రెండుసార్లు గెలుపొందారు. 2014లో చైర్మన్ పదవి అవకాశం కోల్పోయారు. 2026లో వైస్ చైర్మన్ పదవి ఆశించినా దక్కలేదు. శుక్రవారం పట్టణ పార్టీ అధ్యక్షులుగా నియామకం కావడంతో ఆయన అభిమానులు సంబురాలు జరుపుకున్నారు. బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెలుగు వెంకన్న మాట్లాడుతూ పట్టణ అధ్యక్షులుగా తన నియామకానికి సహకరించిన పట్ల సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసీసీ నాయకులు సర్వోత్తమ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లావ్యాప్తంగా దంచికొట్టిన వర్షం!

**సగటున 25.4 మి.మీ నమోదు.**

**సాధారణ స్థితిలోనే ఈ సీజన్ మొత్తం వర్షపాతం.**

**వేములవాడలో అత్యధికంగా 38.1 మి.మీ.. రుద్రంగిలో అత్యల్పం.**

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 04: రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా వరుణుడు ప్రతాపం చూపాడు. రోజంతా పలుచోట్ల విస్తారంగా, మరికొన్ని చోట్ల భారీగా వర్షం కురిసింది. జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. శనివారం ఉదయానికి జిల్లా సగటు వర్షపాతం 25.4 మి.మీ గా నమోదైంది. సాధారణంగా ఈ రోజున కురవాల్సిన 3.6 మి.మీ వర్షపాతంతో పోలిస్తే ఇది ఏకంగా 606 శాతం అధికం కావడం విశేషం. జిల్లాలోని మొత్తం 13 మండలాల్లోనూ వానాకాలం ఊపందుకుంది. మండలాల వారీగా వివరాలు.. అత్యధికంగా వేములవాడలో 38.1 మి.మీ వర్షపాతం నమోదు కాగా, వీర్నపల్లిలో 33.3 మి.మీ, కోనరావుపేటలో 33.1 మి.మీ, తంగళ్లపల్లిలో 29.5 మి.మీ చొప్పున వర్షం కురిసింది. అత్యల్పంగా రుద్రంగి మండలంలో 8.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుండి ఇప్పటివరకు జిల్లాలో కురిసిన మొత్తం వర్షపాతం వివరాలను పరిశీలిస్తే, జిల్లాలో ఇప్పటివరకు 131.0 మి.మీ వాస్తవ వర్షపాతం నమోదైంది. ఈ సమయానికి జిల్లా సాధారణ వర్షపాతం 149.6 మి.మీ ఉండాలి. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ప్రస్తుతం -12 శాతం లోటు ఉన్నప్పటికీ, వాతావరణ శాఖ నిబంధనల ప్రకారం ఇది సాధారణం కేటగిరీగానే పరిగణించబడుతుందని అధికారులు తెలిపారు. ఇదే సమయానికి నమోదైన 114.6 మి.మీ తో పోలిస్తే ఈసారి వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి.

## మటన్ మంచిదేనా ?

**-అధికారుల పర్యవేక్షణ సున్నా**

**- ఒక్కొక్క ఏరియాలో ఒక్కో రేటు**

**- స్టాంపింగ్ లేకుండానే విక్రయాలు**



మంచిర్యాల ప్రతినిధి, జులై 4 (భారత శక్తి): ప్రభుత్వ సెలవు రోజులు,ఆదివారం పండుగలా రోజున మటన్ చికెన్ దుకాణాలు కిక్కిరిసి కనిపిస్తాయి.మంచిర్యాల పట్టణంలోని పలు మటన్ దుకాణాల్లో ఆదివారం పండగ వేల క్వింటలకు కొద్ది మటన్ విక్రయాలు జరుగుతుంటాయి.జీవాలు ఆరోగ్యంగా ఉన్నాయా,లేదో ? అధికారులు ధ్రువీకరించకుండానే షాప్ నిర్వాహకులు జీవాలను ( గొర్రెలు,మేకలు) కోసి మాంసం విక్రయిస్తున్నట్లు సమాచారం.షాపుల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**- నిబంధనలు బేఖాతరు**

మంచిర్యాల పట్టణంలోని ఐ బి చౌరస్తా,హమాలివాడ, చున్నం బట్టి, మటన్ మార్కెట్ , కాలేజీ రోడ్, ఓవర్ బ్రిడ్జి , తిలక్ నగర్, ఎసిసి, పాత మంచిర్యాల, నస్పూర్ సీసీ కార్నర్ ఏరియాలలో ప్రధానంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే మాంసం విక్రయించాల్సింది ఉంటుంది.కానీ ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు తెరుస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది, పైగా జీవాలను ముందుగా పశువైద్యాధికారి పరిశీలించి ధృవీకరించిన వాటి మాంసాన్ని మాత్రమే విక్రయించాలి.పట్టణంలో పశువైద్యాధికారి పరిశీలన లేకుండానే ఇష్టం వచ్చిన జీవాలను గొర్రెలు మేకలు కోసి వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణ వినిపిస్తున్నాయి.వ్యాధుల బారిన పడినవి, వయసు మీరీనా జీవాలను కోసి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు తెలిసింది.కొన్నిచోట్ల ఇళ్ల మద్యే జీవాలను వధించడంతో దుర్గంధం వస్తుందని పలువురు వాపోతున్నారు. మటన్ కోసి బయట తగిలించి ఉంచడంతో దుమ్ము దులితో పాటు ,ఈగలు, దోమలు మాంసం పై వచ్చి చేరుతున్నాయి. షాపుల వద్ద పరిశుభ్రతను గాలికి వదిలేస్తున్నారు. పైగా ధరల వివరాలు పట్టిక ప్రదర్శించాల్సి ఉన్న ఎవరు పట్టించుకోవడం లేదు. పైగా ఒకచోట ఒక విధంగా రేట్ తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల లోకల్ జీవాల పేరుతో బాయిలర్ జీవలను వధించి వీటికి వాటికి ఒకే విధమైన రేటు లేదా బాయిలర్ జీవాలను కోసి లోకల్ జీవాలను చెప్పి విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు మటన్ దుకాణాలపై దృష్టి సారించి, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## మన్యం వీరుడికి నివాళులు అర్పించిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



కూకట్పల్లి, భారత శక్తి ప్రతినిధి, జూలై 04: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామారాజు జయంతి సందర్భంగా ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గారు ఉషాముళ్ళపూడి కామన్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలనను ధిక్కరించి, గిరిజనుల హక్కుల కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని నివాళులు అర్పించి గౌరవించడం మనందరి బాధ్యత అని అన్నారు. అడవులపై గిరిజనులకున్న హక్కులను కాలరాస్తున్న బ్రిటిష్ వారి అణచివేత, అటవీ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రంప (మన్యం) తిరుగుబాటుకు ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. కేవలం 27 ఏళ్ల చిన్న వయసులోనే దేశం కోసం, గిరిజనుల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. అల్లూరి దేశభక్తి, తెగువ నేటి యువతరానికి ఎంతో ఆదర్శనీయమని ఆశయ సాధన, ఆ మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, దేశ సమగ్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శశిధర్ పట్వారీ, గోపాల్, జి.రవి, రాజేష్ చంద్ర, రామరాజు, రఘు, శ్రీధర్, సంగమేష్, లింగం, సత్తయ్య, జీవన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, యాదగిరి, మహేష్, ఖలీమ్, రవీందర్, ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భారత శక్తి
VOICE OF INDIAN
ఆదివారం, జులై 5, 2026

## చంద్రలోక్ కాంప్లెక్స్‌లో అగ్నిమాపక శాఖ

# అధికారులు ఆకస్మిక తనిఖీ

**సికింద్రాబాద్..(భారత శక్తి)** సికింద్రాబాద్ లోని చంద్రలోక్ కాంప్లెక్స్ లో అగ్నిమాపక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇటీవల జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని అగ్నిమాపక అధికారులు చంద్రలోక్ కాంప్లెక్స్ లో అగ్నిమాపక భద్రత వ్యవస్థను పరిశీలించారు. 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ భవనానికి సంబంధించి అగ్నిమాపక వ్యవస్థ పై దుకాణదారులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. భవనానికి సంబంధించి కనీస అగ్నిమాపక భద్రత ప్రమాణాలను సైతం పాటించడం లేదని చెప్పారు . ఆరు అంతస్తులు ఉన్న కాంప్లెక్స్ లో విద్యుత్ వైరింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు ప్రమాదం పొంచి ఉన్నట్లు గుర్తించామన్నారు. విద్యుత్ వైర్లు కేబుల్ వైర్ల మూలంగా విద్యుదగాధం జరిగి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్ లో అగ్నిమాపక నివారణ యంత్రాలు, ఇతర పరికరాలు సైతం సరిగా లేవని భద్రతా ప్రమాణాల దృష్ట్యా అత్యంత ప్రమాదకరంగా ఉందని వెల్లడించారు. ఈ భవనం నిర్మించి 50 సంవత్సరాలు గడచిన నేపథ్యంలో భవన నిర్మాణం పూర్తిగా పాతబడి పెచ్చులు ఊడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయంపై జిహెచ్ఎంసి అధికారులకు, వైరింగ్ వ్యవస్థకు సంబంధించి విద్యుత్ శాఖ అధికారులకు లేఖ రాయనున్నట్లు, యాజమాన్యం దృష్టికి ఈ అంశాలను తీసుకువెళ్తామని అన్నారు. అగ్ని ప్రమాద ఘటన జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు మార్క్ డ్రిల్ నిర్వహించడంతోపాటు చట్టరీత్యా భద్రత ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# అప్రమత్తతతో కుట్రలను చేద్దాం

**– ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం**

**(భారత శక్తి)**ఎస్ ఐ ఆర్ పై ఆందోళన వీడి అప్రమత్తంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఓట్ల తొలగింపు కుట్రలను చేదిద్దామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బూత్ లెవెల్ ఏజెంట్లు కార్యకర్తలకు సూచించారు. ఎస్ ఐ ఆర్ పై సోమాజిగూడ డివిజన్ లో సమగ్ర శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ ఎన్నో అపోహలు, ఆందోళన నడుమ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పై బూత్ లెవెల్ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న పార్టీకి తొత్తుగా మారడంతో సాధారణ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తన ఓటు ఉంటుందో పోతుందోనని ప్రతి ఒక్కరూ భయాందోళన గురి కావటం విచిత్రమైన పరిస్థితిని, ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఎస్ ఐ ఆర్ లో పేరు లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడడం కలిచి వేసిందని అన్నారు. ఓట్లను పరిరక్షించడం అంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమేనన్న ఉన్నత లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు. అందులోకి నన్ను లాగకండి

**– దానం** రాష్ట్రంలో కొనసాగుతున్న సవాళ్లు ప్రతి సవాళ్లపై దానం మాట్లాడేందుకు నిరాకరించారు. సవాళ్లు విసిరిన వారు, స్వీకరించిన వారే చెబుతారని అందులోకి తనను లాగొద్దంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# భూ భారతిలో 98% అప్లికేషన్స్ రిజెక్ట్ చేశారు..

**– ఆ 2% బడాబాబులవి కాబట్టి ఆక్సెప్ట్ చేశారు**

**– మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్**

**హైదరాబాద్(భారత శక్తి)** భూ భారతిలో 98% అప్లికేషన్స్ రిజెక్ట్ చేశారు. ఆ 2% బడాబాబులవి కాబట్టి ఆక్సెప్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆరోపించారు. శనివారం అయన మీడియాతో మాట్లాడారు. శంషాబాద్లో రంగారెడ్డి కలెక్టర్ ఘనకార్యం చేస్తే కూడా ఆయనను మార్చలేదు.. ఎందుకంటే ఆయన చుట్టం కాబట్టి. రేవంత్ రెడ్డి మంత్రులకు సమాచారం ఇవ్వకుండానే వాళ్ల శాఖలలో ఆర్డర్లు జారీ చేస్తున్నాడు. అందుకే క్యాబినెట్ భేటీకి కొండా సురేఖ రాలేదు.. జూపల్లి కృష్ణారావు ఆయన మంత్రి పదవి పీకేస్తున్నారు అని అనగానే బట్టలు చింపుకుంటున్నాడు. రేవంత్ రెడ్డి గారు హిట్లర్ లాగా ఆత్మహత్య చేసుకోకండి. హిట్లర్ పిచ్చి పిచ్చి పనులు చేసి చివరికి ఆత్మహత్య చేసుకున్నాడు. రేవంత్ రెడ్డి దయచేసి అలాంటి పనులు మీరు చేయొద్దని అయన అన్నారు.రేవంత్ రెడ్డి మంది సావు కోరుకుంటాడు కానీ మేము ఆయనలా అనుకోమని అన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి





**రొంపిచర్ల,(భారత శక్తి)** గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మర్రిచెట్టుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలో సంతగుడిపాడు గ్రామానికి చెందిన మారెడ్డి జయరామిరెడ్డి(72) తన స్వగ్రామం నుండి విప్పర్ల గ్రామానికి ఒక పని నిమిత్తం స్కూటీ పై వెళ్ళారు. అక్కడ తన పనులు ముగించుకుని తిరిగి తన స్వగ్రామానికి స్కూటీ పై తిరిగి హైవే రోడ్డు పై వస్తుండగా మర్రిచెట్టు పాలెం వద్దకు రాగానే, వెనుక వైపు నుండి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో, తీవ్ర గాయాలు పాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు





**తుగ్గలి:(భారత శక్తి)** కర్నూల్ లోని కలెక్టర్ కార్యాలయం లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం రోజున కలెక్టర్ సమావేశ భవనం నందు జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి లు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించిన మన్యం పోరాట వీరుడు అల్లూరు సీతారామరాజు అని,స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర చాలా కీలకమైనదని వారు తెలియజేశారు. అదేవిధంగా ట్రైబల్ వెల్ఫేర్ సూపరిండెంట్ సురేష్,గిరిజన నాయకులు లంబాడి హక్కుల పోరాట సమితి స్టేట్ లీడర్ కైలాష్ నాయక్,జిల్లా అధ్యక్షులు యోగేష్ నాయక్,ఎన్టిఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ కుశల్,ఎన్టిఎఫ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మోటా సురేష్, టీఎస్ఎఫ్ స్టేట్ లీడర్ చంద్రప్ప, రామరాజు జనార్దన్ తదితర సభ్యులు పాల్గొని మన్యం వీరుడు స్వతంత్ర పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను వారు కొనియాడారు. అదేవిధంగా గిరిజన హక్కుల సాధన కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు తెలియజేశారు.

# సాధన విద్యానికేతన్ నందు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**తుగ్గలి:(భారత శక్తి)** మండల కేంద్రమైన తుగ్గలి లోని సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు మన్యం వీరుడు,స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణ కార్యక్రమం ద్వారా వారి ధైర్యం,దేశభక్తి, త్యాగస్ఫూర్తిని ప్రతిబింబించేలా ఈ వేడుకను నిర్వహించారు. పిల్లలకు కేవలం పాఠ్యపుస్తకాల ద్వారా చెప్పడం కంటే,ప్రత్యక్షంగా వేషధారణల ద్వారా మహనీయుల జీవితాలను పరిచయం చేస్తే వారు మరింత సులభంగా అర్థం చేసుకుని జీవితాంతం గుర్తుంచుకుంటారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కరస్పాండెంట్ శ్రీ దండు భాస్కర్ యాదవ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సాధన విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటం,ఆదివాసీల హక్కుల కోసం చేసిన త్యాగాలు,ఆయన దేశభక్తి, ధైర్యసాహసాల గురించి వివరించి, ప్రతి విద్యార్థి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ,సేవాభావంతో ఎదగాలని విద్యార్థులకు వారు వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దేశభక్తిని, చరిత్ర పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా,మహనీయుల స్ఫూర్తిని భావితరాలకు చేరవేసే ఒక చిరస్మరణీయ కార్యక్రమంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తల్ సైనిక్ క్యాంప్ ఫైరింగ్ పోటీల్లో

# చిట్వేలు క్యాడెట్లు ఎంపిక



**చిట్వేలి(భారత శక్తి)** తిరుపతి గ్రూప్ పరిధిలో ఏడు ఎన్‌సీసీ బెటాలియన్ల మధ్య గ్రూప్ స్థాయిలో జరిగిన తాల్ సైనిక్ క్యాంప్ ఫైరింగ్ ఎంపికలో చిట్వేలి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ తెలిపారు. గోర్ల వైష్ణవి, చెంజి అక్షయ, రామిశెట్టి కుషాల్‌ఫైరింగ్ విభాగంలో కచ్చితత్వం, క్రమశిక్షణ, ఏకాగ్రత, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ ముగ్గురు క్యాడెట్లు తిరుపతి గ్రూప్ స్థాయిలో జూన్ నెల ఒకటి నుండి 10వ తేదీ వరకు మోహన్ బాబు యూనివర్సిటీలో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో జరిగిన ఎంపికల్లో విజయం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గారాజు ఎంపికైన క్యాడెట్లను అభినందిస్తూ, జాతీయ స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్ మాట్లాడుతూ, ఈ విజయం విద్యార్థుల కృషి, పట్టుదల, నిరంతర సాధనకు నిదర్శనమని అన్నారు. రానున్న ఉన్నత స్థాయి ఎంపికల్లో కూడా ఈ క్యాడెట్లు విజయాలు సాధించి పాఠశాలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. వీరు జూలై 13 వరకు తిరుపతిలో జరిగే కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం 4 లో పాల్గొంటారని తెలియజేశారు.

# పట్టణ సచివాలయంలో రైతులకు భూ హక్కుల పాసు పుస్తకాల పంపిణీ



**గోనెగండ్ల (భారత శక్తి)**ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గోనెగండ్ల పట్టణ సచివాలయం నందు రైతులకు భూ హక్కుల పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు రైతులకు భూ హక్కుల పాసు పుస్తకాలను అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, భూ హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, తమ భూ హక్కులను పరిరక్షించుకోవాలని సూచించారు. నాయకులు మాట్లాడుతూ, ప్రతి అర్హ రైతుకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తమ పాసు పుస్తకాలను భద్రంగా ఉంచుకుని అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. రైతులు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ ఎమ్మెల్యే కి మరియు కార్యక్రమాన్ని నిర్వహించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# వందేభారత్ రైలులో కమాండోస్

**శ్రీనగర్(భారత శక్తి)** అమర్నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రభుత్వం భారీ ఎత్తున భద్రతా చర్యలు చేపట్టింది. జమ్మూ–శ్రీనగర్ వందేభారత్ ఎక్స్ప్రెస్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. రైల్వే భద్రతా విభాగం ఎన్ఎస్జీ కమాండోలను రంగంలోకి దించింది. ప్రస్తుతం రైలులో అధునాతన గన్లతో పహారా కాస్తున్న కమాండోకు సంబంధించిన వీడియో నెట్టింట వైరలవుతోంది.

## గాజువాకలో టీడీపీ ఎమ్మెల్యే

# పల్లా ఆఫీస్ ఎదుట ఉద్రిక్తత

**గాజువాక(భారత శక్తి)** గాజువాకలో టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కార్యాలయం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. పల్లా శ్రీనివాస్రావు ఆఫీస్ను ముట్టడించిన ఉక్కు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేసారు. ఎమ్మెల్యే ఆఫీస్ గేటు ఎదుట బైఠాయించిన మహిళలను బలవంతంగా బయటకు తరలించారు. శనివారం ఉదయం నుంచి 50 మందికి పైగా అరెస్ట్ అయ్యారు. అరెస్ట్ చేసిన వాళ్ళను తక్షణం విడుదల చేయాలని నిర్వాసిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి.


# దిల్సుఖ్ నగర్‌లో ఉద్రిక్తత

**హైదరాబాద్(భారత శక్తి)** శనివారం ఉదయం దిల్ సుఖ్ నగర్ లో ఉద్రిక్తత నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. నిరుద్యోగులను పురుగుల మందు తాగి చావమన్న రేవంత్ రెడ్డిపై నిరుద్యోగులు . భగ్గుమన్నారు. దండం పెట్టి కేసు తీసుకోవాలని వేడుకున్నా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఒక నిరుద్యోగి మట్లాడుతూ రేవంత్ రెడ్డి మమ్మల్ని పురుగుల మందు తాగమని అన్నాడు.. మమ్మల్ని అలా అనడానికి వాడెవడని ప్రశ్నించాడు. దీనిపై సరుర్ నగర్ పోలీస్ స్టేషన్లో మా నిరుద్యోగులం అంతా కలిసి రేవంత్ రెడ్డి మీద ఫిర్యాదు చేశాం. రేవంత్ రెడ్డి 5000 ఉద్యోగాలు వేస్తే ఆయన శవాన్ని కూడా తెలంగాణలో ఉండనివ్వం.. ఆయన బొంద ఆంధ్రలో కడతాం. పురుగుల మందు తాగడానికి కూడా మా దగ్గర డబ్బులు లేవు.. రేవంత్ రెడ్డి ఆ డబ్బులైనా ఇవ్వు కొంటామని అన్నాడు.

# చౌక దుకాణాలకు వెంటనే సరుకులు సరఫరా చేయాలి



**కొత్తపల్లి:(భారత శక్తి)** ప్రభుత్వం రేషన్ కార్డులకు ఇచ్చే బియ్యం సరుకులు జులై 4వ తేదీ వచ్చినా అందకపోవడంతో పేదలు పరేషాన్ అవుతున్నారని చౌక దుకాణాలకు వెంటనే రేషన్ సరుకులు సరఫరా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి యేసు రత్నం మండల కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు శనివారం రోజు కొత్తపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ప్రతినెల 30వ తేదీ లోపు రేషన్ షాపులకు సరుకులు బియ్యం సరఫరా చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని చౌక డిపోలకు జూలై 4వ తేదీ వచ్చిన సరుకులు చేరలేదన్నారు. అంగన్ వాడి, ప్రభుత్వ పాఠశాలల పిల్లలతోపాటు రేషన్ కార్డు కలిగిన పేదలకు బియ్యం సరుకులు అందడం లేదు కేవలం రేషన్ షాపుల నుండి ఇచ్చే బియ్యం పై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు అర్ధాకలితో సరుకుల కోసం ఎదురుచూస్తున్నారు.మండల తాసిల్దార్ కానీ, సివిల్ సప్లై డిటి కానీ ఈ సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు సంబంధిత జిల్లా అధికారులు స్పందించి సకాలంలో రేషన్ షాపులకు బియ్యం సరుకులు అందే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు



## చిట్ ఫండ్ మోసాలపై
# అప్రమత్తంగా ఉండాలి

**- పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు సూచన**



**నరసరావుపేట,(భారత శక్తి)** అధిక లాభాలు, తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు వంటి తప్పుడు హామీలతో చిట్ ఫండ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి కృష్ణారావు సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంస్థ రిజిస్ట్రేషన్, అనుమతులు తప్పనిసరిగా పరిశీలించాలని, నగదు కాకుండా బ్యాంకు లావాదేవీల ద్వారానే చెల్లింపులు చేయాలని తెలిపారు. మోసంపై అనుమానం వచ్చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, 112సమాచారం ఇవ్వాలని సూచించారు.

## గోనెగండ్ల వీధికుక్కల దాడి ఘటనపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి

**- ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం**



**గోనెగండ్ల(భారత శక్తి)** గోనెగండ్ల పట్టణంలో ఒక చిన్నారిపై వీధికుక్క దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి తక్షణమే స్పందించారు. ఘటన వివరాలు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.పట్టణంలోని నివాస ప్రాంతాలు, ప్రధాన వీధులు, బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తున్న ప్రమాదకరమైన వీధికుక్కలను గుర్తించి, వాటిని పట్టుకుని తరలించేలా వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజల ప్రాణాలు, ముఖ్యంగా చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వీధికుక్కల నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.అదేవిధంగా, కుక్క కాటుకు గురైన చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్య అధికారులను ఆదేశించారు. చికిత్సలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు.ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ఇలాంటి ఘటనలపై వెంటనే స్పందిస్తూ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.

## మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకు
# ఘన నివాళులు



**పిడుగురాళ్ల,(భారత శక్తి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు గల రోశయ్య కాంస్య విగ్రహానికి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలును గుర్తు చేసుకుంటూ శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలిగిరి శ్రీనివాసరావు తో పాటు పార్టీ సీనియర్ నాయకులు కొత్త సాంబశివరావు, కుటుంబరావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి - కొండాపూర్‌లో అక్రమాలపై
# హైడ్రా ఉక్కుపాదం

**- బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు భారీ ఎత్తున ఆక్రమణల తొలగింపు**

**(భారత శక్తి)**గచ్చిబౌలి - కొండాపూర్ ప్రధాన రహదారిపై హైడ్రా, సిఎంసి అధికారులు సంయుక్తంగా భారీ ఎత్తున ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ నుంచి మసీద్‌బండ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలు, షెడ్లు, ఇతర ఆక్రమణలను తెల్లవారుజామున 4 గంటల నుంచే తొలగిస్తున్నారు.ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జేసీబీలు, ఇతర యంత్రాలతో అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.ఈ చర్యలతో గచ్చిబౌలి - కొండాపూర్ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని పోలీసులు సూచిస్తున్నారు.

## నగదు చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

నారాయణగూడ**(భారత శక్తి)** పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నగదు చోరీ కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. అమిత్ అగర్వాల్ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన రూ.7.70 లక్షల నగదును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ ఎం.మట్టయ్య హిమాయత్‌నగర్ ఇన్ స్పెక్టర్ ఎం.సైదేశ్వర్ తో కలసి వివరాలు వెల్లడించారు. నిందితుడు జోధ్‌పూర్(రాజస్థాన్)కు చెందిన దీపేష్ ఖతీ(19), ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్ పల్లిలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అవంతి నగర్ లోని అమిత్ అగర్వాల్ ఇంటిలో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో సుమారు రూ.7.70 లక్షల నగదును తన భార్య హ్యాండ్‌బ్యాగులు, లేడీస్ పర్సుల్లో ఉంచి మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఉన్న చెక్క అల్మారాలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. జూన్ 30 ఉదయం నగదు సురక్షితంగానే ఉన్నట్లు నిర్ధారించుకున్న ఆయన భార్య ఈవెనింగ్ వాక్ కు వెళ్లే సమయంలో బెడ్‌రూమ్ తలుపుకు తాళం వేయకుండా వెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో వివిధ అంతస్తుల్లో పనివాళ్లు పనిచేస్తున్నారు. రాత్రి తిరిగి పర్సులను తనిఖీ చేయగా నగదు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంట్లో పనిచేస్తున్న వ్యక్తుల్లో ఎవరైనా నగదును దొంగిలించి ఉండవచ్చని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సాక్ష్యాల సేకరణ, ఇంట్లో పనిచేసిన కార్మికుల విచారణతో పాటు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. సీసీటీవీ కెమెరాల్లో నిందితుడు దీపేష్ కదలికలపై అనుమానం రావడంతో , పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. శుక్రవారం బోయిన్‌పల్లిలోని నిందితుడి గదిపై దాడి చేసి, దొంగిలించిన రూ.7.70 లక్షల నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. దొంగతనం చేసిన తరువాత ఎవరికి అనుమానం రాకుండా , యధావిధిగా పనికి వచ్చాడని , నాలుగు రోజుల తరువాత దొంగిలించిన డబ్బులతో రాజస్థాన్ వెళ్లిపోయేందుకు ప్లాన్ చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

# పొంచి ఉన్న సూపర్ ఎల్నినో..

## ఆహార భద్రతకు ముప్పు తప్పదా?

**హైద్రాబాద్(భారత శక్తి)** ఆహార భద్రతకు ముప్పు తప్పదా?వాతావరణ పరిస్థితులు అంతకంతకు అధ్వానంగా మారుతున్నాయి. నిపుణులు 'తీవ్రస్థాయి సూపర్ ఎల్నినో ముప్పు పొంచి ఉండంటూ హెచ్చరిస్తున్నారు. ఇండియా ఇప్పటికే దాని ప్రతికూల ప్రభావాలకు గురవుతోంది. పైగా ఈ ఏడాది రుతువవన వర్షపాతం దీర్ఘకాలిక నగటులో 90శాతమే ఉంటుందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇంతకీ దేశంపై ఎల్సినో ప్రభావం ఎలా ఉండనుంది? దాన్ని సమర్థంగా ఎదుర్కోవడమెలా? వసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో కొన్నాళ్లకిందట తటస్థంగా ఉన్న 'ఎల్నెనో-నదరన్ అసిలేషన్' పరిస్థితులు ఎల్నినో పరిస్థితులుగా మారుతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన దేశంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్నిని పరిస్థితులు ఏర్పదేందుకు అవకాశం ఉన్నట్లు భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ (ఐఐటీఎం), భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొన్నాయి. ఇతర అంతర్జాతీయ వాతావరణ నమూనాల అంచనాలూ ఇదే సూచిస్తున్నాయి. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో కనిపిస్తున్న తటస్థ ద్విధ్రువ త(ఐవోడీ) పరిస్థితులు రుతుపవనాల కాలంలోనూ కొనసాగవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే, భారత్లో రుతుపవన కాలంలో ఎలి నినో ఏర్పడి, సెప్టెంబరు వరకు కొనసాగుతుందన్న నూట. దీనివల్ల వర్షపాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముంది. అంతవరకు మనం తీవ్రమైన వేడి, పొడి వాతావరణం, అలస్యపు వర్షాలతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.జీవనోపాధికి గట్టి దెబ్బ పసిఫిక్మహాసముద్రంలో ఏర్పడే ఎల్సినో శీతాకాలం వరకు కొనసాగవచ్చని పలు విదేశీ సంస్థలు సూచిస్తున్నాయి. ఇది మన రుతుపవనాలను తూర్పువైపు పసిఫిక్ మహాసముద్రంలోకి నెట్టే అవకాశం ఉంది. ప్రస్తుత ఉపగ్రహ డేటాను పరిశీలిస్తే, ఈ కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. భారత్లో నమోదైన తీవ్రస్థాయి వడగాడ్పులు ఎల్సినో సంకేతాలేనని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈసారి వేసవిలో ఇండియా విపరీతమైన ఉష్ణోగ్రతలను చవిచూసింది. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన పది నగరాలు మన దేశంలోనే ఉన్నాయని నివేదికలు తెలిపాయి. భారత ఉపఖండంలో నగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ పెరిగాయి. మరోవైపు, హిమాలయాలకు ఉత్తరాన 2000-2500 కిలోమీటర్ల పొడవైన మేమాల సమూహం ఏర్పడింది. ఇది దక్షిణ దిశగా దూసుకొచ్చి గంగా మైదాన ప్రాంతాల్లో వాతావరణ జీభత్సాన్ని సృష్టించవచ్చు. ఈ వింత వాతావరణ పరిణామాల కారణంగా ఒక్క యూపీలోనే 30కి పైగా జిల్లాలు బలమైన గాలులు, తుపానులు, భారీ వర్షాలను చూశాయి.ప్రజలు దీన్ని వేడి నుంచి ఉపశమనంగా భావించారు. కానీ, నిజానికి ఇది రుతువవనాలు ఉపఖండం లోపలికి విస్తరించకుండా అడ్డుకుంటున్న వాతావరణ వైపరీత్యం! వాతావరణ వరంగా 2026న సంవత్సరం తీవ్రమైన అనిశ్చితికి దారితీయవచ్చు. దీనివల్ల ఇకుట్ల పాలవనున్న వర్షాధార రైతులను ఆదుకోవడం పై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే, మన సేద్య రంగంలో దాదాపు 60 శాతం మందివర్షాలపై ఆధారపడినవారే. పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగు ద్వారా దేశానికి పౌష్టికాహారాన్ని అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. వర్షపాతం సగటు కంటే తగ్గితే, అది కేవలం ఆహార భద్రతను మాత్రమే కాకుండా, లక్షలాది రైతుల జీవనోపాధిని కూడా నేరుగా దెబ్బతీస్తుంది. ప్రస్తుత అస్థిర, అలన్య వాసల కారణంగా వర్షాధార రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్దతులను అనుసరించడం శ్రేయస్కరం కాదు. గడచిన అయిదేళ్లలో భారతదేశం అతితక్కువ వ్యవధిలో అత్యధిక వర్షపాతం నమోదైన జూన్ నెలను, అత్యంత పొడి వాతావరణం కలిగిన అగస్టు, అక్టోబరు నెలలను చూసింది. తీవ్రమైన వడగాడ్పులు, పశ్చిము వాతావరణ కల్లోలాలు సంప్రదాయ వాతావరణ చక్రాలను పూర్తిగా మార్చేశాయి. దీనివల్ల వర్షాధార రైతులు తీవ్రంగా నష్టపోయి, అప్పుల ఊబిలో దిగబడిపోయారు. గడచిన అయిదేళ్లలో ఒక్క 2025-26లోనే రికార్డు స్థాయిలో ధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, 2021-22 నుంచి ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడం వల్లే గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుసుతులపై తాత్కాలిక నిషేధం విధించాల్సి వచ్చింది. ఈ సమస్యలకు తోడు, ఇరాన్ యుద్ధం వచ్చిపడింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది.

## మందమర్రి మండలంలో
# విద్యా వ్యాపారం పెట్రేగిపోతుంది

**- అన్ని అనుమతులు లేకుండానే ప్రైవేట్ పాఠశాలల ప్రారంభోత్సవాలు**
**- మండల విద్యాధికారి మౌనం పై అనుమానాలు**

**మందమర్రి(భారత శక్తి)** మందమర్రి మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్య యాజమాన్యాలు పెట్రేగిపోతున్నాయి. ఈమధ్య అన్ని అనుమతులు లేకుండానే పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం అయ్యాయని కొన్ని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.సొసైటీ రిజిస్ట్రేషన్ డిఇఓ గుర్తింపు, ఫైర్ శాఖ ఎన్ఓసి, భవన అనుమతులు లేకుండానే యాజమాన్యాలు తరగతి గదులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆరోపిస్తూ సదరు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గత కొన్ని రోజుల క్రితం పలు విద్యార్థి సంఘాల నేతలు ఎంఈఓ కు లిఖితపూర్వక ఫిర్యాదులు చేశాయి. అయితే సదరు అధికారి ఇప్పటివరకు ఆ పాఠశాలలపై స్పందించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్.టి.ఈ. చట్టం ప్రకారం అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలు నడిపితే లక్షలు రూపాయల వరకు జరిమానా విధించి, ఆ పాఠశాలలను సీజ్ చేసే అధికారం విద్యాశాఖకు ఉన్న కూడా విద్యాధికారి స్పందించకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ అధికారుల అనుమతులు తప్పనిసరి ప్రైవేట్ పాఠశాలను స్థాపించాలంటే పాఠశాలను నడిపే యాజమాన్యం తప్పనిసరిగా సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్-1860, ఇండియన్ ట్రస్ట్ యాక్ట్-1882 కింద రిజిస్టర్ అయి ఉండాలి. ఇది లాభాపేక్ష లేకుండా విద్యా సేవ కోసమే పనిచేయాలి. విద్యాశాఖ అనుమతి-రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, ప్రాథమిక పాఠశాలలకు జిల్లా విద్యాధికారి డి.ఈ.ఓ. అనుమతి, గ్రామీణ ప్రాంతంలో అయితే కనీసం 1 ఎకరం, పట్టణ ప్రాంతంలో అయితే 500 చదరపు మీటర్ల సొంత స్థలం, అది లేని పక్షంలో 30 సంవత్సరాల వరకు భూమి లీజు అగ్రిమెంట్ కలిగి ఉండాలి. ఇక భవనం విషయానికి వస్తేక్లాస్‌రూమ్‌కు కనీసం 400 చదరపు అడుగుల స్థలం, మంచి వెంటిలేషన్ ఉండాలి, విద్యార్థులకు సరిపడా ఆట స్థలము తప్పనిసరి, అగ్నిమాపక శాఖ నుండి భవనం సురక్షితమని ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి, దానితోపాటు ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలి.పట్టణ ప్రాంతం అయితే మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతం అయితే పంచాయతీ నుంచి భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ స్థానిక సంస్థల నుండి పొందవలసి ఉంటుంది. ఆ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ నుండి పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీరు, టాయిలెట్స్ సదుపాయం ఉందని హెల్త్ ఆఫీసర్ నుండి ఎన్ఓసి ధృవపత్రము పొందాలి. అనంతరం ఆ పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులకు టెట్, బీఈడీ, డిఈడి, విద్యార్హతలు కలిగి ఉండాలి. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి, దానితోపాటు ఆర్.టి.ఈ. యాక్ట్ 2009 ప్రకారం అన్ని పాఠశాలలు తప్పనిసరిగా అన్ని రకాల గుర్తింపు ధ్రువపత్రాలు తీసుకోవాలి. అవి తీసుకోకుండా పాఠశాలను ప్రారంభిస్తే లక్ష రూపాయల వరకు జరిమానా విధించి ఆ పాఠశాలను సీల్ చేసే అధికారం విద్యా శాఖకు ఉంది. ఇక చివరిగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫీజు నియంత్రణ కమిటీకి ఫీజుల వివరాలు సమర్పించి ఆమోదం పొందాలి. కానీ ఇక్కడ పూర్తి పాఠశాల అనుమతులు లేకుండానే పాఠశాలలను అట్టహాసంగా ప్రారంభించడం అందులో ప్రస్తుతం విద్యా బోధనలు జరగడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది.

### విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యం

ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుమతులు లేవని వీటిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు మండల విద్యాధికారికి లిఖితపూర్వక ఫిర్యాదులు ఇచ్చిన చర్యలు శూన్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరి ఆ అధికారికి విద్యాసంస్థలు, యాజమాన్యాలపై విద్యాధికారి మౌనంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మందమర్రి మండల విద్యాధికారిని మొబైల్ ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

## భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి

**సికింద్రాబాద్.(భారత శక్తి).** కంటోన్మెంట్ ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడి యధేచ్ఛగా నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగుతున్న భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆ హోదాలో కొనసాగేందుకు ఆమె పూర్తిగా అనర్హురాలని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ స్పష్టం చేశారు. తాడు బండ్ రత్న కో-ఆపరేటివ్ సొసైటీలో కంటోన్మెంట్ కు కేటాయించిన 40 శాతం భూభాగంలో వారు నిర్మాణం చేశారని, కంటోన్మెంట్ వాళ్లు కూల్చి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతిసారి కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకొని కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ చట్టం 2006 లోని సెక్షన్ 34 ప్రకారం తక్షణమే కంటోన్మెంట్ బోర్డు సీఈవో, బోర్డు నామినేటెడ్ సభ్యురాలిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ... బోర్డు నామినేటెడ్ సభ్యురాలి భర్త భానుక మల్లికార్జున్ కంటోన్మెంట్ భూమిని ఆక్రమించి అతిథి గృహం నిర్మించుకున్న నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు నుండి నోటీసులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భానుక నర్మదకు పదవి కావాలో లేదా తన అతిథి గృహం కావాలో తేల్చుకోవాలన్నారు. భానుక నర్మదా నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమె నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగడం సిగ్గుచేటని ఆమె రాజీనామా చేసినా లేదా ఆమెను కంటోన్మెంట్ బోర్డు అనర్హురాలిగా ప్రకటించినా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో పేదలకు ఒకరకంగా భాజపా నాయకులకు మరొక రకంగా న్యాయం ఉండకూడదని వెల్లడించారు.

## ట్యాంకుల్లో తెచ్చి.. పంటకు ప్రాణం పోస్తూ

**తాండూరు(భారత శక్తి)** గత నెల రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో వానకాలంలో కంది, పత్తి పంటలు విత్తుకున్న రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు వాహనాల్లో ట్యాంకులు పెట్టి పైపుల ద్వారా నీరు అందిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాం దూరు నియోజకవర్గంలోని తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో దాదాపు రెండు లక్షల ఎకరాల మెట్ట భూములుండగా అందులో 90 శాతం రైతులు పంటలు విత్తు కున్నారు. పైర్లు మొలక దశలోనే ఎండిపోతుండగా మరికొన్ని ప్రాంతాల్లో అసలు మొక్కలే మొలవడం లేదని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో యాలాల మండ లంలోని చెన్నారం గ్రామానికి చెందిన అచ్చయ్య అనే రైతు తాను సాగు చేసిన పత్తి పంటను రక్షించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వాహనం లో ట్యాంకు పెట్టి పైపు ద్వారా పత్తి మొక్కలకు అం దిస్తున్నారు. ఇప్పటికే నాలు గుసార్లు పంటకు నీరు అందించినట్టు చెప్పారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లోనూ ప్రధాన పం టల పరిస్థితి ఇలాగే ఉందని పలు వురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల
# బలవన్మరణం

**కృష్ణా జిల్లా(భారత శక్తి)** గూడూరు మండలం, అనంతాయిపేటలో విషాదం నెలకొంఇ. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికంగా వుంటున్న రజని (60), కుమార్తె గౌరి (40), కోడలు మధు (35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యలే కారణంగా స్థానికుఉ భావిస్తున్నారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరుదైన వ్యాధితో చిన్నారి అధికారుల పరామర్శ

**అన్నమయ్య (భారత శక్తి)** లకలచెరువులోని రాజీవ్ కాలనీకి చెందిన ఐదేళ్ల బాలిక అంతుచిక్కని వ్యాధితో బాధపడుతుంది. దానిపై స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బాలిక ఇంటికి వెళ్లి వ్యాధి వివరాలు తెలుసుకోవాలని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్యకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు డీఎం అండ్ హెచ్ వో బాలిక ఇంటికి చేరుకున్నారు. ఆయన వెంట కంటి, చిన్నపిల్లల వైద్యులు కూడా ఉన్నారు. వైద్యుల నివేదిక మేరకు తదుపరి చికిత్సపై చర్యలు జరిపారు. ఐదేళ్ల చంద్రిక అరుదైన చర్మ, కంటి, ఇతర వ్యాధులతో బాధపడుతోంది.

## 23 మందిని ఉగ్రవాదులుగా
# ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ(భారత శక్తి)** కేంద్ర ప్రభుత్వం తాజాగా 23 మందిని ఉగ్రవాదులకు ప్రకటించింది. 17 మంది పాకిస్థాన్ జాతీయులను, ఆరుగురు భారతీయులను ఉగ్రవాదులుగా గుర్తించింది. ఈ మేరకు ఉపా చట్టం కింద నోటిఫికేషన్ జారీ చేసింది.

## పుల్లంపేట వద్ద రోడ్డు ప్రమాదం



**కడప (భారత శక్తి)**తుఫాన్ వాహనం టైరు పంచరై బోల్తా పడింది. పుల్లంపేట వద్ద ప్రమాదం జరిగింది. ఘటనలో ముగ్గురికీ గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని కర్నూల్ కు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. పుల్లంపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి కోట్లలో
# ముంచేసాడు

**'కిసాన్ పరివార్' భూపాల్ నాయక్ ఘరానా మోసం**

**(భారత శక్తి)**అధిక వడ్డీలు ఇస్తామంటూ నమ్మబలికి, అమాయక ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలు వసూలు చేసి చేతులెత్తేసిన 'కిసాన్ పరివార్' సంస్థల నిర్వాహకుడు భూపాల్ నాయక్ ఉదంతం వెలుగులోకి వచ్చింది. కిసాన్ పరివార్, కిసాన్ పరివార్ లిమిటెడ్, కిసాన్ పరివార్ ఇండస్ట్రీస్, షేర్స్ బజార్ పేరిట కంపెనీలను స్థాపించిన భూపాల్ నాయక్, పెట్టుబడిదారులను భారీగా ఆకర్షించి చివరకు బోర్డు తిప్పేశాడు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్ట్?ఈ భారీ కుంభకోణానికి సంబంధించి గుజరాత్ పోలీసులు గతంలోనే భూపాల్ నాయక్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. కాగా, పది రోజుల క్రితం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకున్న శంషాబాద్ పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం అతడిని గుజరాత్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం నిందితుడిని గుజరాత్ నుండి హైదరాబాద్‌కు తీసుకువస్తున్నట్లు సమాచారం.సైబరాబాద్ సీపీ ఆఫీస్ మెట్లెక్కిన బాధితులు తమకు జరిగిన అన్యాయంపై బాధితులు శనివారం సైబరాబాద్ సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022 నుంచి తాము ఈ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నామని, ప్రారంభంలో ఏడాది పాటు సక్రమంగానే వడ్డీలు చెల్లించి, ఆ తర్వాత నమ్మించి ముంచేశారని మీడియా ముందు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘోరంపై స్పందించిన పోలీసులు, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా 6,000 మంది బాధితులు ఈ కుంభకోణంలో దేశవ్యాప్తంగా సుమారు 6,000 మంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే దాదాపు 1,200 మంది వరకు మోసపోయారు. మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా ఈ మోసం సాగింది.?బాధిత మహిళ ఆవేదన:"నా కూతురి పెళ్లి కోసం దాచుకున్న డబ్బులన్నీ ఎక్కువ వడ్డీ వస్తుందనే ఆశతో ఇందులో పెట్టుబడి పెట్టాను. తీరా వీళ్లు బోర్డు తిప్పేయడంతో వేరే దారి లేక అప్పులు చేసి కూతురి పెళ్లి చేయాల్సి వచ్చింది. మాలాంటి మధ్యతరగతి వాళ్లంతా రోడ్డున పడ్డారు. ప్రభుత్వమే చొరవ తీసుకుని మాకు న్యాయం చేయాలి."?కంపెనీల పేరిట వేల కోట్లు వసూలు చేసిన ఈ భారీ స్కామ్‌పై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు

## ట్రిబుల్ ఐటి (ఐఐఐటి)లో
# విద్యార్థి ఆత్మహత్య

**(భారత శక్తి)**గచ్చిబౌలి ట్రిబుల్ ఐటిలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనిరూధ్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్య మరియు కుటుంబ సమస్యల వల్ల బాధపడుతున్నట్లు సమాచారం. తాను ఉంటున్న బిల్డింగ్ 6వ అంతస్తు పై నుండి దూకి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి గా గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# లోకేశ్ కనగరాజ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రెజీనా!

కోలీవుడ్‌లో హిట్ డైరెక్టర్‌గా గుర్తింపు సాధించిన లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నిర్మాతగా మరో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ', 'లియో' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన లోకేశ్... హీరోగా 'డీసీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆయన నిర్మాతగా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటించబోతోందట. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయిందని, సినిమా షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని చెబుతున్నారు. లోకేశ్ కనగరాజ్ 'డీసీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ, తన తదుపరి ప్రాజెక్టులపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. డైరెక్టర్‌గా, హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా సినిమా ఇండస్ట్రీలో తన ముద్ర వేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రం ద్వారా రెజీనా కసాండ్రా మరో మంచి అవకాశం కొట్టేసిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# యూట్యూబ్ లో 'కన్నప్ప'.. ఫ్రీగా చూడొచ్చు!

నటుడు, నిర్మాత మంచు విష్ణు తన ప్రతిష్టాత్మక చిత్రం 'కన్నప్ప'ను ప్రేక్షకులకు మరింత చేరువ చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ భక్తిరస చిత్రాన్ని యూట్యూబ్ వేదికగా పూర్తి నిడివితో ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. వారాంతంలో కుటుంబ సభ్యులు, భక్తులు ఎటువంటి వ్యయం లేకుండా ఈ చిత్రాన్ని వీక్షించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శివభక్తుడైన కన్నప్ప జీవన గాథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై డాక్టర్ మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో విష్ణు మంచు టైటిల్ రోల్ పోషించగా.. మోహన్ బాబు, ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, బ్రహ్మానందం వంటి భారీ తారాగణం కీలక పాత్రల్లో నటించారు. గతేడాది జూన్ 2025లో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో విశేష ప్రేక్షకాదరణ పొందింది. సినిమా విడుదలై ఏడాది పూర్తయిన సందర్భంగా జూన్ 27, 2026న పరిమిత సంఖ్యలో కొన్ని థియేటర్లలో ఈ చిత్రాన్ని పునఃప్రదర్శించారు. తాజాగా, జూలై 3 నుండి ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో ఈ పూర్తి చిత్రం స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల్లోనూ దీనిని అందుబాటులో ఉంచారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఇటువంటి పౌరాణిక, భక్తి చిత్రాలను అత్యధిక మంది ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతోనే చిత్ర బృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు





# జారా బ్రాండ్‌పై త్రిష ఆగ్రహం

### డెలివరీకి ముందు చెక్ చేయరా అంటూ ఘాటు విమర్శలు

దక్షిణాది స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ప్రముఖ అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్ జారా (ఖతీఖు) పై సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన దుస్తులు నాణ్యతలేకుండా రావడంతో పాటు వాటి నుంచి దుర్వాసన వస్తోందని ఆరోపిస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఘాటుగా స్పందించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో, జారా నుంచి వరుసగా మూడు సార్లు వచ్చిన దుస్తుల నుంచి చెమట వాసన వస్తోందని పేర్కొన్నారు. డెలివరీకి ముందు ఉత్పత్తులను కనీసం సరిచూసి ప్యాక్ చేయాలని, అంతర్జాతీయ స్థాయి బ్రాండ్ నుంచి ఇలాంటి అనుభవం ఎదురవుతుందని ఊహించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ప్రముఖ సెలబ్రిటీ ఇలాంటి ఫిర్యాదు చేయడంతో ఈ అంశం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. త్రిష పోస్టుకు స్పందించిన పలువురు నెటిజన్లు కూడా తమకు జారాతో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ బ్రాండ్ సేవలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై జారా సంస్థ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఇదే సమయంలో త్రిష షేర్ చేసిన మరో ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. పెరిమెనోపాజ్ దశలో ఇతరుల అభిప్రాయాల గురించి ఎక్కువగా పట్టించుకోకుండా, తన జీవితాన్ని తన ఇష్టానుసారం జీవించే ధోరణి పెరుగుతుందని ఒక వైద్యుడు చెప్పిన వ్యాఖ్యను ఆమె షేర్ చేస్తూ, దానికి "ఖీఖుఖ్" అని క్యాప్షన్ జత చేశారు. దీంతో ఆమె ఈ పోస్ట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌తో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. విజయ్ పుట్టినరోజు సందర్భంగా త్రిష చేసిన ప్రత్యేక పోస్ట్, అలాగే ఇద్దరూ కొన్ని కార్యక్రమాల్లో కలిసి కనిపించడం ఈ వార్తలకు మరింత ఊతమిచ్చాయి. అయితే ఈ ప్రచారంపై ఇప్పటివరకు త్రిష లేదా విజయ్ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇక సినిమాల విషయానికి వస్తే, త్రిష వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. ఇటీవల విడుదలైన ఆమె చిత్రం 'కరుప్పు' ప్రేక్షకాదరణ పొందడంతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి

# రచ్చ గెలిచేందుకు రంగం సిద్ధం



అంబాజీపేట మ్యారేజి బ్యాండు, లిటిల్ హార్ట్స్ చిత్రాలతో యువతరం మనసులు దోచింది తెలంగాణ ముద్దుగుమ్మ శివానీ నాగారం. ఇంట ఎట్లాగూ గెలిచింది. ఇక రచ్చ గెలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నది ఈ అందాలభామ. తమిళంలో టూరిస్ట్ ఫ్యామిలీ, విత్ లవ్ చిత్రాల ద్వారా అటు నటుడిగా, ఇటు దర్శకుడిగా కూడా గుర్తింపు తెచ్చుకున్న అభిషేక్ జీవంత్ హీరోగా, గౌతమ్ శివరామ్ దర్శకత్వంలో తమిళంలో రూపొందుతున్న చిత్రంలో శివానీ నాగారం కథానాయికగా ఎంపికైంది. యోగలక్ష్మి ఇందులో మరో కథానాయిక. డ్రామా కంపెనీ సమర్పణలో ఎ.బాలమురుగన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించిన ఓ వీడియోను మేకర్స్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'తమిళంలో నేను చేస్తున్న తొలి సినిమా ఇది. నాకు చాలా ప్రత్యేకం. అభిషేక్‌తో కలిసి నటిస్తున్నందుకు ఆనందంగా ఉంది. తనెంతో ప్రతిభావంతుడు. ఇక శివరాజ్‌కుమార్‌సార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడమే గొప్ప వరం' అంటూ ఆ వీడియోలో శివానీ నాగారం పేర్కొన్నది. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానున్నది.

# అమీర్‌ఖాన్ 'లాల్‌కార్'

'లగాన్' వంటి కల్ట్‌క్లాసిక్ ఫిల్మ్ తర్వాత దర్శకుడు అశుతోష్ గోవారికర్‌తో అగ్ర హీరో అమీర్‌ఖాన్ చేయబోతున్న తాజా సినిమా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. 'లగాన్' విడుదలై 25 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో ఈ దర్శకహీరోలిద్దరూ మరో క్రికెట్ నేపథ్య చిత్రానికి సిద్ధమవుతుండటం విశేషం. స్వతంత్ర భారత్ తొలి క్రికెట్ సారథిగా, భారతీయ క్రికెట్ పితామహుడిగా కీర్తిగడించిన లాలా అమర్‌నాథ్ స్ఫూర్తివంతమైన జీవిత కథతో ఈ సినిమా తెరకెక్కనుంది. 1947 ఇండియా-పాకిస్థాన్ విభజన కూడా కథలో కీలకాంశం. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా అక్టోబర్‌లో సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హీరాని రచయితగా పనిచేస్తున్నారు. 'లగాన్' టైటిల్‌ను స్ఫురించేలా 'లాల్‌కార్' టైటిల్‌ను ఖరారు చేశారని సినిమా సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.



# శ్రీనివాస మంగాపురం విడుదల అప్పుడే!



సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, ఘట్టమనేని రమేశ్‌బాబు తనయుడు జయకృష్ణని చిత్రసీమకు పరిచయం చేస్తూ అజయ్‌భూపతి తెరెక్కిస్తున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని కథానాయిక. డా. మోహన్‌బాబు పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. పి. కిరణ్ ఈ చిత్రానికి నిర్మాత. అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ సమర్పకుడు. శుక్రవారం ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సినిమా విడుదల కానున్నది. తన మార్క్ ఇంటెన్సిటీతో అందమైన ప్రేమకథగా దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ఇందులో పవర్‌ఫుల్ యాక్షన్ అంశాలు కూడా ఉంటాయని, జయకృష్ణ ఘట్టమనేని, రాషా తడానీ జంట యూత్‌ని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జయకృష్ణ ×ూజ, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: చందమామ కథలు.

# 'బ్లాస్ట్' దర్శకుడితో సినిమా?




తమిళ యాక్షన్ థ్రిల్లర్ 'బ్లాస్ట్' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే టాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు సుభాష్ కె రాజ్. అర్జున్, అభిరామి, ప్రీతి ముకుందన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఓటీటీలో సైతం ఆదరణ చూరగొంటున్నది. దర్శకుడు సుభాష్ కె రాజ్ ఎంచుకున్న కాన్సెప్ట్, మేకింగ్ స్టైల్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ యువ దర్శకుడితో హీరో నాని ఓ సినిమా చేయబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలావుండగా నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్' షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఆగస్ట్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత ఆయన సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే.

# ఆ క్రూరత్వం తెలిస్తే ఆశ్చర్యపోతారు



ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా షూటింగ్ గప్‌చుప్‌గా జరిగిపోతున్నది. సినిమా షూటింగ్ ప్రారంభంలో ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ మూవీగా 'డ్రాగన్' నిలుస్తుందని సినిమాపై అభిమానుల్లో అంచనాలు పెంచారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. తాజాగా ఆయన అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో 'డ్రాగన్' గురించి, అందులోని ఎన్టీఆర్ పాత్ర గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. దాంతో 'డ్రాగన్'పై అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఆయన మాట్లాడుతూ 'అయిదేళ్ల క్రితం 'డ్రాగన్' కథ చెప్పేందుకు తారక్‌ని కలిశాను. కథంతా విన్న తర్వాత నిర్ణయం తెలిపేందుకు తను కాస్త ఇబ్బంది పడ్డట్టు అనిపించింది. ఈ కథను ఓకే చేయడం నిజంగా కఠినమైన నిర్ణయం. 'డ్రాగన్'లో కథానాయకుడి పాత్ర అత్యంత క్రూరంగా ఉంటుంది. ఆ క్రూరత్వం తెలిస్తే ఆశ్చర్యపోతారు. సాధారణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఆ పాత్ర తీరుతెన్నులుంటాయి. అందుకే.. తను అంగీకరించడేమో అనుకున్నా. కానీ నాకే షాకిస్తూ ఒప్పుకున్నాడు. ఆ నిర్ణయమే త్వరలో ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వబోతున్నది' అంటూ ధీమా వెలిబుచ్చారు ప్రశాంత్‌నీల్. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 1960 కాలంలో ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీ, నల్లమందు వ్యాపారం నేపథ్యంలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న విడుదల కానున్నది. రుక్మిణీవసంత్ కథానాయిక. అనిల్‌కపూర్ కీలక పాత్రధారి. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీమేకర్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# మారుతోన్న రాయలసీమ



**కర్నూలు, (భారత శక్తి)** రాయలసీమ నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు. రాయలసీమ కేంద్రంగా ఎందరో రాజకీయాలు చేశారు. కానీ ఆ స్థాయిలో రాయలసీమ మాత్రం అభివృద్ధి చెందలేదు. కానీ కూటమి వచ్చిన తరువాత రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి. దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, రాజకీయ శంకుస్థాపనల డ్రామాతో విసిగిపోయిన కడప స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో ఎట్టకేలకు ఒక బలమైన ముందడుగు పడింది. కడప స్టీల్ ప్లాంట్ కు శ్రీకారం చుట్టనున్నారు. ఇది కేవలం కొబ్బరికాయలు కొట్టే మరో సాంప్రదాయక భూమి పూజ కాదు. పక్కాగా నిర్మాణ పనుల ప్రారంభోత్సవం. జిందాల్ ఆధ్వర్యంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ తొలి దశ ఉత్పత్తిని అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇది నిజంగా రాయలసీమ చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వివాదాల మయంగా మారిన రాయలసీమ.. ఇప్పుడు పారిశ్రామికంగా.. రాయల పరిశ్రమల సీమగా రూపాంతరం చెందుతూ ఉండడం శుభపరిణామం. ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు అవుతున్నాయి. అయితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా నిలబెట్టడంలో శ్రీ సిటీ కీలక పాత్ర పోషించింది. గ్లోబల్ కంపెనీలకు క్యారాఫ్ అడ్రస్ గా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న పరిశ్రమల జాతర ఒక ఎత్తు అయితే.. ఇటీవల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు మరో ఎత్తు. రాయల్ ఎన్ఫీల్డ్, హీరో మోటో కార్ప్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో తమ ప్లాంట్లను నిర్మించాయి. వేలాదిమంది స్థానిక యువతకు, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాయి. గతంలో వచ్చిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించింది. అయితే ప్రస్తుతం శ్రీ సిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పారిశ్రామిక వైభవానికి సరికొత్త కేంద్రంగా మారింది. అన్నింటికీ మించి రాయలసీమ గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశంలోనే టాప్ హబ్ గా మారింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో గ్రీన్ కో, ఆర్సలర్ మిట్టల్, ఐర్ఈడిఏ భాగస్వామ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో వెనుకబడిన ప్రాంతంగా.. కరువు సీమగా ముద్రపడిన రాయలసీమ.. ఇప్పుడు పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అటు బెంగళూరు ఐటి, ఆటోమొబైల్ క్యారీడర్.. ఇటు చెన్నై పోర్టులకు కనెక్టివిటీ ఉండడంతో రాయలసీమ కు ప్లస్ పాయింట్ గా నిలుస్తోంది. ప్రధానంగా ఖనిజ సంపద, ఇనుప ఖనిజం, సున్నపురాయి నిల్వలు భారీ సిమెంట్, స్టీల్ పరిశ్రమలకు బలమైన పునాదులుగా మారాయి. బలమైన రాజకీయ సంకల్పం, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుండడంతో రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుంది.

### మంటపెట్టిన జిందాల్ ట్వీట్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటాయో ఊహించడం చాలా కష్టం. నిన్నటి వరకూ ఓ లెక్కన సాగిన రాజకీయం.. నేటి ఉదయానికి మరోలా మారిపోతుంది. అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో.. "క్రెడిట్" అనే అంశం చాలా కీలకంగా మారుతోంది. ఏ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి అయినా మేమంటే మేమే కారణమనే వైఖరి పార్టీలలో కనిపిస్తోంది. మొన్నటి గూగుల్ డేటా సెంటర్ మొదలుకుని.. నేటి కడప స్టీల్ ప్లాంట్ వరకూ పొలిటికల్ పార్టీలు ఈ" క్రెడిట్"ను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉండగా.. ఆయా పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో వీటిని హోరెత్తిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందన్నారు. సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించి ఈ కలను నిజం చేశామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నామని పనిలోపనిగా వైసీపీపైనా విమర్శలు చేశారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు చంద్రబాబు. కడపలో స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ బృందానికి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా జగన్ అభివర్ణించారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎన్నో ఏళ్ల కృషి, ప్రణాళిక అనే పునాదులపై ఇలాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు నిర్మితమవుతాయన్న వైఎస్ జగన్.. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కడప స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కీలకమైన పునాదులు వేశామన్నారు. పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపు, భూముల కేటాయింపు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కోసం భూమిని అందించామన్నారు. ఈ కారణాలతోనే ప్రాజెక్టు వేగంగా కదిలిందన్న జగన్.. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావటం సంతోషకరమంటూ జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. మరోవైపు జగన్ చేసిన ట్వీట్‌కు సజ్జన్ జిందాల్ రిప్లై ఇచ్చారు." మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు, జగన్ గారు.. మీ ప్రభుత్వ హయాంలో లభించిన ప్రారంభ అనుమతుల నుంచి నేటి ఈ ప్రారంభోత్సవం వరకు సాగిన ఈ ప్రయాణం నిరంతర కృషికి నిదర్శనం. ఈ ప్రాంత యువత, కుటుంబాల కోసం ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అంటూ జిందాల్ ట్వీట్ చేశారు. సజ్జన్ జిందాల్ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతుల ద్వారానే కడప స్టీల్ ప్లాంట్ సాధ్యమైందని స్వయంగా జిందాల్ చెప్పారని వైసీపీ మద్దతుదారులు ట్వీట్లు చేస్తున్నారు. జగన్ హయాంలో వేగంగా ఇచ్చిన అనుమతులతోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని.. టీడీపీ ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నీరు, కరెంట్, రహదారులు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసి.. పనులు ప్రారంభమయ్యేలా చేసింది చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ శ్రేణులు కౌంటరిస్తున్నాయి.

# రాజధాని చుట్టూ మరోసారి రగడ..

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షం నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని భవిష్యత్తుపై వస్తున్న ప్రకటనలు పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తోంది. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అయితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన "మావిగన్" వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఈ ప్రకటనతో రాజధాని అంశం మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారింది. ఈ పరిణామాలు అమరావతి అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ రాజధానిపై తరచూ రాజకీయ వివాదాలు కొనసాగితే కొంతమంది పెట్టుబడిదారులు నిర్ణయాలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ తరహా రాజకీయ చర్చల ప్రభావం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో రాజధాని అంశంపై వచ్చిన వివిధ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం మందగించిన పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుతం తిరిగి నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న సమయంలో మరోసారి అనిశ్చితి ఏర్పడితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడే అవకాశాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయి. కొత్త సంస్థలు, సేవా రంగ సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో రాజకీయ ప్రకటనలు వ్యాపార నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయనే సందేశాన్ని స్పష్టంగా చేరవేయడం, రాజధాని నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రజలకు వివరించడం కూడా కీలకమని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే అమరావతి అంశం కేవలం రాజకీయ చర్చకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ముడిపడి ఉంది. అందువల్ల రాజకీయ విభేదాల కంటే అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### విజయసాయిరెడ్డి సలహాలు

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి వర్సెస్ మావిగన్ చర్చ తెరపైకి వచ్చింది. 2029 ఎన్నికల్లో మావిగన్ ఎజెండాతో ప్రజల్లోకి వెళతామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కూటమి పార్టీలు కూడా అప్పుడు మూడు రాజధానులు, ఇప్పుడు మావిగన్ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని జగన్‌కు కౌంటర్ ఇస్తున్నాయి. తాజాగా అమరావతి వర్సెస్ మావిగన్ అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ రెండు అంశాలపై తన అభిప్రాయాలను చెప్పుకొచ్చారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమేనని చెబుతోందని.. వైఎస్సార్‌సీపీ మావిగన్ అంటోందని.. ఒక బాధ్యత కలిగిన ఒక పౌరుడిగా రెండు రాజకీయపార్టీలు చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తర్వాత తన అభిప్రాయాలను అందరితో పంచుకుంటున్నాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై గతంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని.. 12 ఏళ్లు అవుతున్నా సరే ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలనే చర్చ జరుగుతోందని.. ఇది అందరూ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తర్వాత.. అంటే 2029లో మరోసారి సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని.. ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో చేస్తున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అన్నారు. అమరావతిలో మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులకు భూములు ఇచ్చారని.. కానీ ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించలేదని, అసలు కేటాయింపులు చేయలేదని.. దీనిని ఎలా సమర్థించుకుంటారని.. లక్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. వీజీటీఎం కాన్సెప్ట్ (విజయవాడ?గుంటూరు?తెనాలి?మంగళగిరి) విభజన చట్టంలోనే ఉందని.. ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందని ప్రశ్నించారు విజయసాయి. ప్రధానంగా రాజధాని నిర్మాణం పేరుమీద అవినీతి జరుగుతోందని.. కూటమి ప్రభుత్వం రాజధాని కోసం ఏకంగా రూ. 50 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నార విజయసాయి. అమరావతిలో జరుగుతున్న ప్రతి నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని ఆరోపించారు. దీన్ని బట్టి రాజధానిలో అవినీతికి పథకం వేస్తున్నారని.. అందుకే అమరావతి అనే అందమైన పేరు పెట్టారన్నారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటూ 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. వాస్తవానికి అమరావతిలో ఉన్న అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి.. ఇప్పుడు నిర్మాణం చేస్తున్న బిల్డింగులు ఉన్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న క్షేత్రం అయితే.. ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రం అని ఘాటుగా స్పందించారు. 'అమరావతి బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25?30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు.. ఈ అవినీతిని మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాలి. అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకం. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమిషన్లు కొట్టాలి అన్నది కాదు కదా?. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

# డీజీ రైతు బజార్లకు భారీ స్పందన

**విశాఖపట్టణం(భారత శక్తి),** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంభించిన డీజీ రైతుబజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. డీజీ రైతు బజార్లలో నామమాత్రంగా డెలివరీ ఛార్జీల వసూలు చేస్తున్నారు. దీంతో వినియోగదారుల నుంచి ఆదరణ పెరుగుతోంది. జూన్ నెలలో ఆర్డర్లు 5,800 దాటాయి.. దీంతో నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఈ డీజీ రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు.

విశాఖ మాత్రమే కాదు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల కోసం వినూత్న ఆలోచన చేసింది.. ఇంటికే కూరగాయల్ని హోం డెలివరీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో డీజీ రైతు బజార్లను ప్రారంభించింది. మార్కెటింగ్ శాఖ ప్రారంభించిన ఈ రైతు బజార్లకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో గతేడాది డిసెంబర్‌లో రైతు బజార్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఆ తర్వాత మధురవాడ, గాజువాక, గోపాలపట్నం, నరసింహనగర్‌లో ఏర్పాటు చేశారు. నగరంలోని ఐదు డీజీ రైతుబజార్ల నుంచి జూన్ నెలకు సంబంధించి 5,800కుపైగా హోం డెలివరీలు చేశారు. నగరంలో కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయలు చేరవేస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

డీజీ రైతు బజార్లలో తాజా, నాణ్యమైన కూరగాయలను ప్రజలు అందిస్తున్నారు. కూరగాయల్ని చేరవేసేందుకు డెలివరీ బాయ్స్‌ను నియమించారు.. రోజుకు 12 గంటల పాటూ సేవలు అందిస్తున్నారు. వీరికి నెలకు రూ. 19 వేల జీతం ఇస్తున్నారు. డెలివరీ బాయ్స్ ఆర్డర్ రాగానే కూరగాయల్ని గ్రేడింగ్ చేసి హోం డెలివరీ చేస్తున్నారు.

ఒకవేళ కూరగాయలు నాణ్యంగా లేకపోతే మళ్లీ మార్చి ఇస్తారు. దీంతో ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని చెబుతున్నారు. ఈ డీజీ రైతు బజార్ల నుంచి ఐదు కిలో మీటర్ల వరకు మాత్రమే ఈ సేవలు అందిస్తున్నారు. అందుకే కేవలం 10 నిమిషాల్లోనే కూరగాయాలు వినియోగదారులకు అందుతున్నాయి. కూరగాయలు హోం డెలివరీ చేసినందుకు నామమాత్రపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఒక్కో ఆర్డర్‌కు కిలోమీటర్‌కు రూ. 1 డెలివరీ ఛార్జ్.. హ్యాడ్లింగ్ ఛార్జీల కింద రూ. 10 వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ. 100కు కూరగాయలు ఆర్డర్ పెడితే రూ. 115 (రూ. 100 కూరగాయలు+ఐదు కిలోమీటర్లకు రూ. 5 డెలివరీ ఛార్జ్+హ్యాండ్లింగ్ ఛార్జ్ రూ. 10) వసూలు చేస్తారు.

ప్రతి రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు ఈ డీజీ రైతు బజార్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజల నుంచి మంచి ఆదరణ పెరగడంతో నగరంలోని మరికొన్ని చోట్ల రైతు బజార్లను విస్తరిస్తామని అధికారులు చెబుతున్నారు. కూరగాయలతో పాటుగా నిత్యావసర సరుకులు కూడా అందజేస్తున్నాము అంటున్నారు. డెలివరీ బాయ్స్ కూడా ఈ సేవలపై సంతృప్తితో ఉన్నారు.

## ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీ భవన్..!

**విజయవాడ(భారత శక్తి),** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ. 105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

## మావిగన్‌పై ధర్మాన ఆగ్రహం

**శ్రీకాకుళం,(భారత శక్తి)** రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు కొందరు నాయకులు. కానీ ఏపీలో రాజకీయాలు మారిపోవడంతో వారి బాధ అంతా కాదు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి నేతలుగా చలామణి అయ్యారు. చాలా స్వేచ్ఛగా రాజకీయాలు చేశారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంట్రీ తో చాలామంది నేతల తలరాతలు మారిపోయాయి. రాజకీయాల్లో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వారి వ్యవహార శైలి ఉంది. పదవులు సైతం ఉన్నా అధికారం వెలగబెట్టలేని పరిస్థితి వారిది. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో వారు సతమతం అవుతున్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో పలుచన అవుతున్నారు. రాజధానుల అంశానికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి వైఖరితో విసిగి వేసారి పోతున్నారు కొంతమంది సీనియర్లు. అటువంటి వారిలో ధర్మాన ప్రసాద రావు ముందుంటారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండే ధర్మాన.. అదే జగన్మోహన్ రెడ్డి కింద పని చేయాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో జగన్ విధానాలను సమర్థించాల్సి వచ్చింది. ఇప్పుడు అవే చేటు తెస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా వ్యవహరించారు ధర్మాన ప్రసాదరావు.

తొలి మూడేళ్లు ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో మౌనమునిగా మారిపోయారు. మంత్రి పదవి ఇచ్చేసరికి యాక్టివయ్యారు. జగన్మోహన్ రెడ్డి మంచితనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనకు విశాఖ పాలన రాజధాని అస్త్రం దొరికింది. గ్రామాల్లో ఏకంగా సభలు ఏర్పాటు చేసి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర కోసం విశాఖను రాజధానిగా చేర్చారని.. ఆయన రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ప్రజలు ఆ మాటలను విశ్వసించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు. అయితే జగన్మోహన్ రెడ్డి మావిగన్ స్టాండ్ తీసుకోవడంతో ధర్మాన ప్రసాదరావు లాంటివారు డిఫెన్స్ లో పడిపోయారు. వాస్తవానికి 2014 ముందు ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉంటూ.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన చెప్పే మాటకు విశ్వాసం, విశ్వసనీయత ఉండేది. మంచి వాగ్ధాటితో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపగల నాయకుడిగా పేరు ఉండేది. ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. జగన్మోహన్ రెడ్డి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం.. అవి ఎప్పటికప్పుడు మారిపోతుండడంతో ధర్మాన ప్రసాదరావు వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేలా చేశాయి. వాస్తవానికి ధర్మాన ప్రసాదరావు జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని విభేదిస్తారన్న కామెంట్ ఉంది. జగన్ వైఖరిని పెద్దగా ఇష్టపడరని కూడా అనుచర వర్గం చెబుతుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో.. గత్యంతరం లేని స్థితిలో జగన్ పంచన చేరారు అని కూడా కామెంట్స్ ఉన్నాయి. కానీ అదే జగన్ విధానాలను బలంగా బలపరిచి ధర్మాన ప్రసాదరావు మరింత బలహీనం అయ్యారు. విశాఖ రాజధాని విషయంలో అతి చేశానని.. మావిగన్ స్టాండ్ తో జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతీశారన్న ఆవేదనతో ఉన్నారట ధర్మాన. చూడాలి ధర్మాన ఎలా ముందుకు వెళ్తారో..

## విజయనగరంలో రియల్ జోరు

**విజయనగరం (భారత శక్తి)**భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ఉత్తరాంధ్ర తలరాతను మార్చబోతోంది ఈ విమానాశ్రయం. అయితే ఎయిర్పోర్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజయనగరం జిల్లా సరిహద్దులతోపాటు భోగాపురం చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూములతో పాటు ఇళ్ల స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టేందుకు భారీగా ముందుకు వస్తున్నారు.

సాధారణంగా వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తుంటారు. కానీ భోగాపురంలో ఓపెన్ ప్లాట్ల వెంచర్ల స్థానంలో.. సరికొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమర్షియల్ విల్లా ప్రాజెక్టులు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. ఎయిర్పోర్ట్ కారిడార్ ఆనుకొని ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా.. వందల ఎకరాల్లో ఆధునిక టౌన్షిప్ ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమైతే.. ఈ ప్రాంతం ఒక పెద్ద ఎకానమిక్ హబ్ గా మారనుంది. ప్రధానంగా ప్రీమియం నివాస గృహాలకు, కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఉత్తరాంధ్రలో వలసలు ఎక్కువ. ఆపై చదువుకున్న వారు సైతం విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో స్థిరపడిన వారు ఉన్నారు.

అటువంటి వారంతా భోగాపురం పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఉన్నత రంగాల్లో స్థిరపడిన వారు మాత్రం కమర్షియల్ విల్లాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ప్లాట్ లతోపాటు వెళ్లాలని ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. తమ సొంత గడ్డపై అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం పక్కనే స్థిరాస్తి కలిగి ఉండడాన్ని గొప్పగా భావిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ధర పెరుగుతుందన్న ఆశతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ఒక్క భోగాపురం మాత్రమే కాదు విజయనగరం జిల్లాలోని రెండు మూడు నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంటుంది భోగాపురం విమానాశ్రయ నిర్మాణంతో. భూములతో పాటు ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా భారీగా జరుగుతున్నాయి.

ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు ప్రధాన కేంద్రంగా మారనుంది భోగాపురం. భవిష్యత్తులో భోగాపురం ఒక నగరంగా అవతరించనుంది. వారం వారం ఇక్కడి చదరపు గజం ధరలు మారుతుండడంతో స్థానిక రైతులు, భూ యజమానులకు ఊహించని రీతిలో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది

# నిజాం దొరల నియంతృత్వ ఆగడాలను ఎదిరించిన ధీరుడు దొడ్డి కొమురయ్య

**ప్రాజెక్టుల పేరుతో పెట్టుబడిదారులకు పేదల భూములు కట్టబెడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు**

**సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి.**




జనగామ (భారత శక్తి) జులై 4: తెలంగాణ ప్రాంతంలో నైజాం రజాకార్లు జాగిర్దార్లు భూస్వాములు చేస్తున్న దోపిడి పీడనపై కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిజాం దొరల నియంతృత్వ ఆగడాలను ఎదిరించిన ధీరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం దేవర్పుల మండలంలోని కడవెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని పురస్కరించుకొని సిపిఎం ఆధ్వర్యంలో వారి స్థూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సిపిఎం మండల కార్యదర్శి ఇంటి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పెద్ద ఎత్తున ప్రజలు రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో పేదలకు భూములు పంచడమే కాకుండా స్వేచ్ఛ స్వతంత్రం రావడం జరిగిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని వారన్నారు, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజలు పోరాడి సాధించుకున్న హక్కులను భూములను గుంజుకునేందుకు ప్రయత్నం చేస్తుందని, ప్రాజెక్టుల పేరుతో అదానీ అంబానీలకు కట్టపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందని ప్రజలు వారి ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని నిలువ నీడలేని ప్రజలు గుడిసెలు వేసుకొని నివసిస్తుంటే సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం వాళ్ల గూడును కూల్చి వేస్తూ దుర్మార్గ పద్ధతి ఒడిగాడుతోందని గుడిసెలు వేసుకున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని ఇందిరమ్మ ఇండ్లు అర్హులై వారందరికీ ఇవ్వాలని పెన్షన్స్ నిరుద్యోగ భృతి జిల్లాలో పెండింగ్లో ఉన్న రిజర్వాయర్ పనులు వెంటనే పూర్తి పూర్తి చేసి రైతాంగానికి సాగు త్రాగునీరు అందించాలని జిల్లాలో రైతులు కూలీలు కార్మికులు కర్షకులు, విద్యార్థులు యువజనులు వృత్తిదారులు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఎం చేసే పోరాటంలో కొమురయ్య స్ఫూర్తితో ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్,సుంచు విజేందర్, మండల్ నాయకులు పయ్యావుల బిక్షపతి, ఐలాపురం నరసమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసగాని సుమ, గడ్డం యాదగిరి, చింత మైసయ్య, పి రవి, పి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల,జూలై 04: వేములవాడ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఆర్జేసీసీఈటీ (RJCCET) ప్రవేశాల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 6న జిల్లా స్థాయిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీ. జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని సీటు పొందని విద్యార్థినులు, అలాగే ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన విద్యార్థినులు సిరిసిల్ల బద్దెనపల్లి బాలికల జూనియర్ కళాశాల నందు జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినులు తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తదితర అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీ. జ్యోతి కోరారు.

## రోడ్డు ప్రమాదానికి కారణమై... ఎదురు బెదిరింపులకు దిగిన తండ్రీకొడుకులు.

**బాధితుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన నిందితులు; ఒకరి రిమాండ్.**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 04: అతివేగంగా, అజాగ్రత్తగా స్కూటీ నడుపుతూ వచ్చి ఎదుటివారిని ఢీకొట్టడమే కాకుండా, ఎదురు తిరిగి బెదిరింపులకు గురిచేసిన తండ్రీకొడుకులపై గంభీరావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై శ్రీకాంత్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 29న రాత్రి 9:00 గంటల సమయంలో రేశం శ్రీనివాస్, రసమల్ల రమేష్ అనే ఇద్దరు స్నేహితులు గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ (కేజీ టూ పీజీ ) సమీపంలో గల ఒక మిర్చి బండి వద్ద ఆగి ఉన్నారు. అదే సమయంలో దమన్నపేట గ్రామానికి చెందిన అవునూరి శంకర్ కుమారుడు యశ్వంత్ తన ఎలక్ట్రిక్ స్కూటీపై అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చి ఫిర్యాది (శ్రీనివాస్) బండిని బలంగా ఢీకొట్టాడు. ప్రమాదం అనంతరం యశ్వంత్ కింద పడిపోయాడు. ప్రమాదానికి తానే కారణమైనప్పటికీ, తన స్కూటీ రిపేర్ నిమిత్తం రూ. 5,000 ఇవ్వాలంటూ ఫిర్యాదిని అక్కడికక్కడే బెదిరించాడు. మరుసటి రోజు ఉదయం యశ్వంత్ తండ్రి అవునూరి శంకర్ సైతం ఫిర్యాదికి ఫోన్ చేసి, తన కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించాలని, లేదంటే చూసుకుంటామని బెదిరింపులకు దిగాడు. దీంతో భయాందోళనకు గురైన ఫిర్యాది, యశ్వంత్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లి బలవంతంగా రూ. 7,816 బిల్లు చెల్లించాడు. అంతటితో ఆగకుండా, ఆ మరుసటి రోజు శంకర్ మళ్లీ ఫోన్ చేసి అదనంగా మరో రూ. 10,000 ఇవ్వాలని, లేనిపక్షంలో కేసు పెడతామంటూ తీవ్రంగా బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గంభీరావుపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతివేగంగా స్కూటీ నడిపి ప్రమాదానికి కారణం కావడమే కాకుండా, డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడినందుకు గానూ ఏ1 గా అవునూరి శంకర్, ఏ2 గా యశ్వంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో ఏ1 నిందితుడు అవునూరి శంకర్ ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

# వేములవాడ నాయీ బ్రాహ్మణ ఓనర్స్ & వర్కర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక.

## సేవల ధరల పెంపు నిర్ణయం




భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూలై 04: వేములవాడ నాయీ బ్రాహ్మణ ఓనర్స్ ఢ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంఘ సభ్యులు ప్రస్తుతం పెరుగుతున్న నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని హెయిర్ కటింగ్, షేవింగ్ తదితర సేవల ధరలను పెంచాలని నిర్ణయించారు. అనంతరం సంఘం నూతన అధ్యక్షుడిగా సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సూత్రం శ్రీనివాస్, ఇన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా కొత్వల నర్సింహులు, కోశాధికారిగా వెలిశాల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా సూత్రం రమేష్, కళ్యాణం లక్ష్మణ్, గంగిపల్లి రవి, వెల్దిరాజు, సారం పెల్లి సంతోష్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ, సభ్యుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి కృషి చేయడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించే దిశగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. అలాగే, పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకుని సేవల ధరలను సవరించినట్లు వెల్లడించారు. సభ్యులంతా ఐకమత్యంతో సంఘం అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన.

- **మూడపల్లిలో మెగా గురుకులానికి భూమి పూజ చేసిన ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **వేములవాడ నియోజకవర్గంలో 18 నెలల్లో కార్పొరేట్ స్థాయి రెసిడెన్షియల్ స్కూల్ అందుబాటులోకి: అది శ్రీనివాస్**
- **రాజన్న సిరిసిల్ల జిల్లాలో వెయ్యి కోట్లతో శరవేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు**




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 04: చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, గ్రామస్తులు మూడపల్లి బస్ స్టాండ్ నుండి భారీ ర్యాలీతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రూ. 200 కోట్లతో, 2600 మంది విద్యార్థులకు వసతితో కూడిన నాణ్యమైన కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని, దీనిని 16 నుండి 18 నెలల్లోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ స్కూల్ వేములవాడ నియోజకవర్గానికే మణిహారంగా నిలుస్తుందని, ఇందుకు భూమిని అందించిన దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువస్తోందని, హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొన్ననే ఆరుట్లలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీనిని ప్రారంభించుకున్నామని, త్వరలోనే వేములవాడ నియోజకవర్గానికి కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనం అందిస్తున్నామని, గురుకుల విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచినట్లు గుర్తుచేశారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, త్వరలోనే రుద్రంగి మండల కేంద్రంలో ఏటీసీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. గత పది సంవత్సరాలుగా పడకేసిన పనులన్నీ ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో వేగంగా ముందుకు సాగుతున్నాయని అది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాను ఆనాడు దేనికోసమైతే పోరాడారో, అందులో 95 శాతం పనులను పూర్తి చేశానని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో రూ. 1000 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. గత ప్రభుత్వం నేతన్నలకు పెట్టిన రూ. 300 కోట్ల బకాయిలను విడుదల చేయడమే కాకుండా, తాజాగా కోటి చీరల ఆర్డర్‌ను కూడా అందించామని స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని గత ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం చేసి తప్పిదాలు చేసిందని విమర్శించారు. తాము రాజన్న ఆలయాన్ని రూ. 150 కోట్లతో, శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు ఆగమశాస్త్రం ప్రకారం పాత ఆలయాన్ని ఏమాత్రం మార్చకుండా విస్తరిస్తున్నామని తెలిపారు. బాసర నుండి భద్రాచలం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలో 50 ఏళ్లుగా జరగని రోడ్డు విస్తరణ పనులు ఇప్పుడు శరవేగంగా జరుగుతున్నాయని.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో ఆనాడు డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే, ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలో వేములవాడ నుండి సిరికొండ వరకు 3 లైన్ల రోడ్డు మంజూరైందని తెలిపారు. త్వరలోనే చందుర్తి - మోత్కూరావు పేట రోడ్డుకు భూమి పూజ చేస్తామని, కొనరావుపేట మండల పరిధిలో బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. భీమారం, మేడిపల్లి, కథలాపూర్ మండలాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ అండగా ఉంటారని, ఆనాడు పీసీసీ అధ్యక్షుడి హోదాలోనే ఆయన ముంపు గ్రామాల్లో బస చేసి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తు చేశారు.

రైతు సంక్షేమం గురించి మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా జరిగిందని, గతంలో కంటే లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎక్కువగా సేకరించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మర్రిపల్లిలో 40 ఎకరాల స్థలంలో రూపుదిద్దుకోబోతున్న రైతు విజ్ఞాన కేంద్రం రైతులకు భూసార పరీక్షలు చేసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ వివరించారు.

## దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

భారత శక్తి, జూలై 04 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 81వ వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరవీరుడైన దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని ఆయన అడుగుజాడలలో పనిచేసే అవకాశం లభించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో వెనుకబడిన తరగతుల కులాలకు అండగా నిలబడిన దొడ్డి కొమరయ్య మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యువత దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. దొడ్డి కొమురయ్య ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూషణ్ పాండే సేవలు మరువలేనివి

**-వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ వి. సత్యనారాయణ గౌడ్.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 04(భారత శక్తి) భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 36 సంవత్సరాల పాటు అధ్యాపకుడిగా సేవలందించి వేలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన భూషణ్ పాండే సేవలు మరువలేనివని వశిష్ట జూనియర్ కళాశాల డైరెక్టర్ వి. సత్యనారాయణ గౌడ్ అన్నారు. భూషణ్ పాండే పదవీ విరమణ సందర్భంగా శనివారం భైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘన సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, భూషణ్ పాండే సత్ప్రవర్తన, క్రమశిక్షణ, అంకితభావంతో విద్యార్థులకు బోధన అందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేరేలా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించినప్పటికీ వశిష్ట జూనియర్ కళాశాల అభివృద్ధికి కూడా ఆయన అందించిన సహాయ సహకారాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. తమకు, కళాశాలకు భూషణ్ పాండేతో విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్. నారాయణ రెడ్డి, న్యాయవాది మరియు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి పాండే, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేష్, నాయకులు గాలి రవి, ప్రభాకర్, సాయినాథ్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొని భూషణ్ పాండేను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## నిర్మల్ కలెక్టరేట్లో ఎక్స్పైరీ వాటర్ బాటిళ్లు..!

**దిశ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు గడువు ముగిసిన తాగునీటి పంపిణీ**

**నాణ్యత నియంత్రణ, పర్యవేక్షణపై ప్రశ్నల వర్షం**

**విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్.**



నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూలై 04 (భారత శక్తి): జిల్లాలో అత్యున్నత ప్రభుత్వ కార్యాలయమైన నిర్మల్ కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో గడువు ముగిసిన మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ కావడం తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సరఫరా అయ్యే వస్తువుల నాణ్యతపై అధికార యంత్రాంగం ఎంత మేర పర్యవేక్షణ చేపడుతోందన్న ప్రశ్నలు ఈ ఘటనతో తెరపైకి వచ్చాయి. శుక్రవారం నిర్వహించిన దిశ సమావేశానికి ఎంపీ గడ్డం నగేష్, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాతో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన వారికి పంపిణీ చేసిన తాగునీటి బాటిళ్లలో ఒకదానిపై ముద్రించిన వివరాలను పరిశీలించగా, తయారీ తేదీ 10-12-2025, వినియోగ గడువు 08-06-2026గా ఉండటంతో గడువు ముగిసిన బాటిల్‌ను పంపిణీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ అత్యున్నత కార్యాలయంలోనే గడువు ముగిసిన తాగునీటి బాటిళ్లు పంపిణీ కావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సరఫరా చేసిన సంస్థ గడువు ముగిసిన స్టాక్‌ను పంపిందా లేక అధికారులు తనిఖీ చేయకుండా పంపిణీ చేశారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

### నాణ్యత తనిఖీలు ఎక్కడ..?

ప్రభుత్వ సమావేశాలకు వినియోగించే తాగునీరు, ఆహార పదార్థాలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుంది. అయితే కలెక్టరేట్‌లో జరిగిన ఈ ఘటనతో ఆ తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయంలోనే ఈ పరిస్థితి ఉంటే సాధారణ ప్రజలకు విక్రయించే తాగునీటి నాణ్యతపై సంబంధిత శాఖలు ఎంత మేర పర్యవేక్షణ చేస్తున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ఆరోగ్యానికి ప్రమాదమే..!

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం గడువు ముగిసిన ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను వినియోగించడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. నిల్వ వ్యవధి పూర్తయిన తర్వాత ప్లాస్టిక్ సీసాల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండటంతో పాటు, నీటి నాణ్యత కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇలాంటి బాటిళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు పంపిణీ చేయడం తీవ్ర నిర్లక్ష్యంగా భావిస్తున్నారు. ఇటీవలే ఎక్స్పైరీ మందులు ఇప్పుడు వాటర్ బాటిళ్లు కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో అక్కడ గడువు ముగిసిన కొన్ని మందులు గుర్తించిన విషయం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు అదే జిల్లాలోని కలెక్టరేట్లో ఎక్స్పైరీ వాటర్ బాటిళ్లు బయటపడటంతో ప్రభుత్వ శాఖల్లో నాణ్యత నియంత్రణ, పర్యవేక్షణ వ్యవస్థపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

ఈ ఘటనపై సంబంధిత శాఖలు వెంటనే విచారణ చేపట్టి, గడువు ముగిసిన తాగునీటిని సరఫరా చేసిన సంస్థపై, అలాగే తనిఖీలు నిర్వహించకుండా పంపిణీ చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలకు సరఫరా అయ్యే అన్ని వస్తువుల నాణ్యత, గడువు తేదీలను తప్పనిసరిగా తనిఖీ చేసే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy